ఆదివారం
14-05-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 321
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

నేడు టర్కీలో ఎన్నికలు

టర్కీలో ఆదివారం (14వ తేదీ) ఎన్నికలు జరగనున్నాయి. దేశ భవిష్యత్‌ను యువ ఓటర్లు నిర్ణయించబోతున్నారు. మొత్తం 64 మిలియన్ల మంది అర్హులైన ఓటర్లుండగా వీరిలో ఆరు మిలియన్ల మంది తొలిసారి ఓటేసేవారున్నారు. 3.4 మిలియన్ల మంది విదేశీ ఓటర్లు ఉండగా వీరంతా ముందుగానే తమ ఓటును భద్రపరిచారు.

2 లో

కర్నాటక హస్తగతం

పార్టీ	స్థానాలు
కాంగ్రెస్ +	136
బీజేపీ	65
జేడీఎస్	19
ఇతరులు	04

వాడిన కమలం - 65 సీట్లకే పరిమితం

- 136 స్థానాల్లో కాంగ్రెస్ విజయం
- పదేళ్ల తర్వాత తిరిగి అధికారంలోకి
- సంబురాల్లో పార్టీ శ్రేణులు

బెంగళూరు: కర్నాటక రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంది.అసాధారణ రీతిలో అఖండ విజయాన్ని నమోదు చేసింది. హస్తం వికాసంతో కమలం వాడిపోయింది. 224కుగాను 136 అసెంబ్లీ స్థానాల్లో విజయ కేతనాన్ని కాంగ్రెస్ ఎగురవేసింది. సునాయాసంగా 113 (మ్యాజిక్ ఫిగర్) లక్ష్యాన్ని ఛేదించి అతిపెద్ద పార్టీగా అవతరించింది. పదేళ్ల తర్వాత దక్షిణాది రాష్ట్రాన్ని తిరిగి కైవసం చేసుకోవడమే కాకుండా ప్రత్యర్థి భారతీయ జనతా పార్టీ (బీజేపీ)ని 65 స్థానాలకు పరిమితం చేసి సత్తా చాటుకుంది. గతసారితో పోల్చితే కాంగ్రెస్ ఓటుశాతం 43.1శాతానికి పెరిగింది. మరోవైపు బీజేపీ ఓట్లు 36.22శాతానికి తగ్గాయి. హంగ్ వస్తుందన్న ఎగ్జిట్ పోల్ అంచనాలను మించి సీట్లను కాంగ్రెస్ గెలుచుకుంది. గతేడాది జరిగిన హిమచాల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలోనూ కాంగ్రెస్ పార్టీ గెలిచింది. దీంతో బీజేపీ ఖాతాలో రెండవ ఓటమి జమైంది. కింగ్‌మేకర్‌గా చెప్పుకున్న

- మిగతా 2 లో

దెబ్బ మీద దెబ్బ

ఉప ఎన్నికల్లోనూ బీజేపీకి భంగపాటే

న్యూఢిల్లీ: కమలం పార్టీకి దెబ్బ మీద దెబ్బ పడుతోంది. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) వ్యతిరేక పవనాలు దేశంలో బలంగా వీస్తున్నాయి. ఆ పార్టీపై ప్రజల విశ్వాసం సన్నగిల్లుతోంది. ప్రధాని మోదీ చరిష్మా పనిచేయడం లేదు. మొన్న హిమాచల్ ప్రదేశ్‌లో నేడు కర్నాటకలో కాంగ్రెస్ పార్టీ బీజేపీని దెబ్బతీసింది. కన్నడ రాష్ట్రంలో అఖండ విజయాన్ని నమోదు చేసింది. తాజాగా పంజాబ్, ఒడిశా, మేఘాలయ, ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ బీజేపీ ఓడిపోయింది. పంజాబ్‌లోని జలంధర్ లోక్‌సభ స్థానంతో పాటు ఉత్తరప్రదేశ్‌లోని సువార్, ఛాన్‌బే, ఒడిశాలో జార్సుగూడ, మేఘాలయలోని సోహియోంగ్ అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. జలంధర్ స్థానంలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సత్తా చాటింది. ఆ పార్టీ అభ్యర్థి సుశీల్ కుమార్ రింకూ విజేతగా నిలిచారు. 58,647 ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థి కరంజీత్ కౌర్ చౌదరిపై ఓడించారు. యూపీ, సువార్, ఛాన్‌బే స్థానాల్లో బీజేపీ మిత్రపక్షం అప్నాదళ్ (ఎస్) గెలిచింది. సువార్‌లో షఫీక్ అహ్మద్ అన్సారీ 8,724 ఓట్లతో గెలవగా సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి అనురాధా చౌహాన్ రెండోస్థానంలో నిలిచారు. ఛాన్‌బేలోనూ అప్నా దళ్ (ఎస్)కు చెందిన రింకీ కోల్ విజేతగా నిలిచారు. సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి కీర్తికోల్‌పై తొమ్మిది వేల ఓట్లతో గెలిచారు. ఒడిశాలోని జార్సుగూడ స్థానంలో బీజేపీ అభ్యర్థి దీపాలీ దాస్ గెలుపొందారు. 48,721 ఓట్లు సాధించారు. సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి తంకధార్ త్రిపాఠిని చిత్తుచేశారు. మేఘాలయలోని సోహియాంగ్ స్థానంలో యునైటెడ్ డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి సింషర్ కుపర్ రాయ్ థాబా గెలిచారు. 3,400 ఓట్లతో ప్రత్యర్థి, ఎన్‌పీపీ అభ్యర్థిని ఓడించారు.

విద్వేషానికి ముగింపు... ప్రేమకు నాంది

రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ శనివారం కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ పని తీరును ప్రశంసించారు. 'నఫ్రత్ కా బజార్ (ద్వేషపు దుకాణం) మూతపడింది... రాష్ట్రంలో 'మొహబ్బత్ కి దుకానీన్ (ప్రేమ దుకాణాలు) తెరుచుకున్నాయని అన్నారు. కర్నాటకలోని

- మిగతా 2 లో

ప్రధానికి నైతిక ఓటమి: సీపీఐ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర, హైదరాబాద్: కర్నాటకలో బీజేపీ ఓటమి అనేది ప్రధాని నరేంద్ర మోదీని నైతికంగా ఓడించిందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. దక్షిణాదికి ద్వారంగా ఉండే కర్నాటకలో ఓటమి ద్వారా బీజేపీకి దక్షిణ భారతదేశ ద్వారం మూతపడినట్లు అయిందని వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్యం వచ్చాక అనేక మంది ప్రధానులు ఎన్నికల ప్రచారం చేశారని, కాని కర్నాటక

- మిగతా 2 లో



మసక బారుతున్న బాల్యం

శ్రమ దోపిడీ... హక్కుల ఉల్లంఘన

న్యూఢిల్లీ : బాల్యం మసక బారుతోంది. వారు పేదరికంలో మగ్గిపోతూ... బాల కార్మికులుగా నలిగిపోతున్నారు. అందమైన, ఆనందకర బాల్యాన్ని కోల్పోతున్నారు. పాలకులు వారి కోసం చేసిన చట్టాలు అమలుకాకపోవడంతో బాలల జీవితాలు ఛిద్రమయ్యాయి. దేశంలో పేదరికం ఎక్కువగా ఉందనడానికి ప్రత్యక్ష సాక్షులు బాల కార్మికులే. చిన్నారులు ఆనందోత్సాహాలతో గడిపితేనే భవిష్యత్తులో మానవ వనరులు అభివృద్ధి చెందుతాయి. అయితే ఇప్పుడు దేశంలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. బాల కార్మికుల సంఖ్య అధికమై కలవరపెడుతోంది. 2025 నాటికి బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలన్న లక్ష్యం నీరుగారిపోతోంది.

అమలుకు నోచుకోని నిర్బంధ విద్య

బాల కార్మిక వ్యవస్థ చిన్నారుల శ్రమను దోచుకునేందుకు, వారి హక్కులను హరించేందుకు దోహదపడటమే కాకుండా

- మిగతా 2 లో

కోర్టు తీర్పు బేఖాతర్

- జడ శ్రావణ్‌కుమార్ పాదయాత్ర భగ్నం
- సంఘీభావం తెలిపే రైతులను అడ్డుకున్న పోలీసులు
- ఆర్-5 జోన్‌లో పనులకు అడ్డుకట్ట
- పెట్రోలు సీసాలతో మహిళల నిరసన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: జీవో-1 రాజ్యాంగ విరుద్ధమని హైకోర్టు స్పష్టంగా చెప్పినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ తీరులో ఏమాత్రం మార్పు కానరావడం లేదు. ఆర్-5 జోన్‌కు వ్యతిరేకంగా 'జైభీమ్' పార్టీ వ్యవస్థాపకుడు, హైకోర్టు న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ శనివారం శాంతియుతంగా చేపట్టిన పాదయాత్రను పోలీసులు అడ్డుకున్నారు. ఆయన పాదయాత్రకు సంఘీభావం తెలిపేందుకు అంబేద్కర్ స్మృతివనం వద్దకు బయలుదేరిన రైతులను సైతం అడ్డుకున్నారు. దీంతో తుళ్లూరు దీక్షా శిబిరం వద్ద పోలీసులు, రైతుల మధ్య తోపులాట చోటుచేసుకుని తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఇళ్ల నిర్మాణం కోసం ఇతర ప్రాంతాలకు చెందిన దాదాపు 50 వేల మందికి రాజధానిలో సెంటు భూమి చొప్పున ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా సీఆర్‌డీఏ అధికారులు యుద్ధప్రాతిపదికన పొలం పనులు చదును చేస్తూ ప్లాట్లు విడగొడుగుతున్నారు. ఈ పనులను రాజధాని నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులు అడ్డుకుంటున్నారు. రాజధాని మాస్టర్‌ప్లాన్‌ను విచ్ఛిన్నం చేసేలా ఆర్-5 జోన్‌లో లేఅవుట్ పనులు చేపట్టకుండా కొద్దిరోజులుగా ప్రతిఘటిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పాదయాత్ర చేపట్టాలని, అంబేద్కర్ స్మృతివనం వరకు దానిని కొనసాగించాలని శ్రావణ్‌కుమార్ నిర్ణయించారు. దీనికి సంఘీభావంగా రైతులు శనివారం తుళ్లూరు దీక్షా శిబిరం నుంచి శాఖమూరు వద్ద ఉన్న అంబేద్కర్ స్మృతివనం వరకు పాదయాత్ర చేయటానికి సన్నద్ధమయ్యారు. దీంతో అక్కడ భారీ సంఖ్యలో పోలీసులు మోహరించారు. దీక్షా శిబిరం నుంచి రైతులు, మహిళలు, రైతు కూలీలను బయటకు రానివ్వకుండా పోలీసులు అడ్డుగా నిలిచారు. పోలీసులను తోసుకొని బయటికి రావడానికి రైతులు ప్రయత్నించారు. ఈ క్రమంలో రైతులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. కొంతమంది రైతులు దీక్షా శిబిరం వెనుక నుంచి పొలాల్లోకి వెళ్లి...అక్కడ నుంచి స్మృతివనం చేరుకున్నారు. మరికొంతమంది రైతులను పోలీసులు

- మిగతా 2 లో

2 లో

రూ.12 వేల కోట్ల డ్రగ్స్ పట్టివేత

- కేరళ తీరంలో భారీ నౌక నుంచి 2,500 కిలోలు స్వాధీనం
- మెథాంఫెటమిన్‌గా గుర్తింపు... పాకిస్తాన్ జాతీయుడి అరెస్ట్
- నావికాదళం, ఎన్‌సీబీ సంయుక్త ఆపరేషన్

అకాల వర్షాలకు గుల్లబారిన పసుపు

తగ్గిన ధరరాక గిరి రైతుల దిగాలు

పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-చింతపల్లి: అకాల వర్షాలకు పసుపు ధర పతనం కావడంతో మన్యం ప్రాంతంలోని పసుపు రైతులు దిగాలు చెందుతున్నారు. పసుపు చేసే మేలు అమ్మ కూడా చేయదంటారు. అందుకేనేమో రెండేళ్లకు ఒకసారి వచ్చే పంట అయినా గిరిజనులు పసుపు పండించేందుకే ఎక్కువగా ఆసక్తి చూపుతారు. మన్యంలో దేశవాళీ పసుపు రెండేళ్లకు ఒకసారి చేతికొస్తుంది. పంట వేసిన మొదటి ఏడాది కలుపు తీసి గొప్పు చేస్తారు. రెండవ ఏడాదికి పసుపు దిగుబడి ఆశాజనకంగా వస్తుంది. జనవరి, ఫిబ్రవరి నాటికి పసుపు మొక్కలు వాడిపోగానే రైతులు పసుపు తవ్వేందుకు ఉపక్రమిస్తారు. తవ్వి తీసిన పసుపును ఉడకబెట్టి, ఎండబెట్టి, పాశ్చరైజింగ్ చేస్తారు. వివిధ దశల తర్వాత పసుపు మంచి వర్ణంతో తయారవుతుంది. గిరిజన ప్రాంతంలో పండించే దేశవాళీ పసుపుకు వ్యాధి నిరోధక శక్తి అధికంగా

- మిగతా 2 లో

ఇదీ లోకం!



మోదీ అజేయుడేమీ కాదు:

ఎంపీ వినయ్ విశ్వం

2 లో

ఇంటికెళ్లిన ఇమ్రాన్ ఖాన్

పీటీఐ వర్గాల్లో ఆనందోత్సాహం

గిరిజన ఎమ్మెల్యేల తిరుగుబాటు

మణిపూర్‌లో తెరపైకి ప్రత్యేక ప్రాంతం డిమాండ్

ఐజ్వాల్: మణిపూర్‌లో పార్టీలకతీతంగా గిరిజన ఎమ్మెల్యేలు తిరుగుబాటుకు తెరలేపారు. తమ వర్గం కోసం ప్రత్యేక పాలనాయంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని 10 మంది గిరిజన ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. మణిపూర్‌లో మెయితీ, గిరిజన వార్గల మధ్య హింస చెలరేగిన నేపథ్యంలో ఈ డిమాండ్ తెరపైకి వచ్చింది. మణిపూర్‌లోని చిన్-కుకీ-మిజో-జోమి వర్గానికి చెందిన 10 మంది గిరిజన శాసనసభ్యులు ఏకతాటిపైకి వచ్చారు. పది మందిలో ఏడుగురు ఎమ్మెల్యేలు బీజేపీ, ఇద్దరు కుకీ పీపుల్స్ అలయెన్స్(కేపీఏ), ఒక ఇండిపెండెంట్ ఉన్నారు. ఇద్దరు కుకీ, ఇండిపెండెంట్ ఎమ్మెల్యే కూడా బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏలో భాగస్వాములుగా ఉన్నారు. 'మమ్ములను రక్షించడంలో మణిపూర్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. అందుకే భారత రాజ్యాంగానికి అనుగుణంగా మాకు ప్రత్యేక ప్రాంతాన్ని ఏర్పాటు చేయాలని భారత ప్రభుత్వాన్ని కోరుతున్నాం. మణిపూర్‌కు పొరుగువారిగా ప్రశాంతంగా జీవిస్తాం' అని ఎమ్మెల్యేలు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మెజారిటీ మెయితీ వర్గం దుర్మార్గంగా హింసకు పాల్పడిందని, దీనికి బీజేపీ ప్రభుత్వం సైతం పూర్తి మద్దతిచ్చిందని గిరిజన ఎమ్మెల్యేలు విమర్శించారు. మెయితీ వర్గం మే 3వ తేదీన హింస ప్రారంభించిందని, పాలకుల

- మిగతా 2 లో

ఇంటికెళ్లిన ఇమ్రాన్ ఖాన్

పీటీఐ వర్గాల్లో ఆనందోత్సాహం

ఇస్లామాబాద్: పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు అన్ని కేసుల్లో ఊరట లభించింది. దీంతో ఆయన శనివారం తన లాహోర్ ఇంటికి చేరుకున్నారు. ఇస్లామాబాద్ హైకోర్టు బెయిల్ మంజూరు చేసిన తర్వాత ఆయన కొన్ని గంటల పాటు తన లీగల్ టీమ్‌తో చర్చలు జరిపారు. పోలీసులు తనను బలవంతంగా కోర్టురూమ్‌లో ఉంచారని ఇమ్రాన్ ఆరోపించారు. అవినీతి కేసులో రెండు వారాల బెయిల్‌ను హైకోర్టు మంజూరు చేసింది. అలాగే సోమవారం వరకు ఇతర ఏ కేసులోనూ ఆయనను అరెస్టు చేయొద్దని ఆదేశాలిచ్చింది. ఇమ్రాన్‌ను కట్టుదిట్టమైన భద్రత నడుమ కోర్టుకు తరలించారు. భద్రతా కారణాలతో ఆయన అక్కడ నుంచి నిష్క్రమించేందుకు కనీసం మూడు గంటలు పట్టింది. ఇంటికి వెళ్లిన ఇమ్రాన్ తన మద్దతుదారులకు అభివాదంచేశారు. ఆనందంగా ఉన్న వారంతా తమ అభిమాన నాయకుడిపై గులాబీల వర్షం కురిపించారు. ఆటపాటలతో, బాణాసంచా పేలుళ్లతో సందడి చేశారు. ఇమ్రాన్ ఖాన్ ఇంట్లోకి ప్రవేశించడం, ఆయనకు సోదరీమణులు, ఇతర కుటుంబ సభ్యులు స్వాగతం పలకడం, క్షేమ సమాచారం కోరడానికి సంబంధించిన వీడియోను పీటీఐ విడుదల చేసింది. ఇమ్రాన్ ఖాన్‌పై దేశంలో 120కుపైగా కేసులు ఉన్నాయి. అయితే లాహోర్‌కు ప్రయాణించే వాహనం నుంచి ఇమ్రాన్ ఓ వీడియో విడుదల చేశారు. అందులో తనను పోలీసులు బలవంతంగా ఆపివుంచినట్లు చెప్పారు. తన అరెస్టు ఎపిసోడ్ అంతటికీ ఆర్మీచీఫ్ కారణమని ఆరోపించారు. ఇది భద్రతా వ్యవస్థలు చేసింది కాదు. దీని వెనుక ఒకే ఒక్క వ్యక్తి ఉన్నారు. ఆయనే సైన్యాధిపతి అని ఇమ్రాన్ ఖాన్ వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే 12వ తేదీ రాత్రి 10 గంటలప్పుడు మొబైల్ ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించారు. సామాజిక మాధ్యమాలపై ఆంక్షలను కూడా ఎత్తివేశారు.

540మందికిపైగా పీటీఐ నేతలు అరెస్టు

ఇమ్రాన్ అరెస్టు అనంతరం చెలరేగిన హింస, ప్రభుత్వం-ప్రజాస్తులకు నష్టంపై ఉగ్రవాద నిరోధక చట్టం కింద పీటీఐ పార్టీకి చెందిన 540 మందికిపైగా నాయకులను పంజాబ్ ప్రభుత్వం అరెస్టు చేసింది. ఈనెల 9వ తేదీ నుంచి పంజాబ్ పోలీసులు 205 కేసులను ఆ పార్టీ అధికారులు, ఉద్యోగులపై నమోదు చేశారు. నిరసనలకు పాల్పడిన వారికి సీసీటీవీ ఫుటేజీ, వీడియో రికార్డింగులు, సామాజిక మాధ్యమాల్లో పోస్టుల ద్వారా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం అరెస్టుల తర్వాత నిర్బంధించిన నేతలు, మద్దతుదారుల సంఖ్య 2,790కి పెరిగిందని అన్నారు.

అంధకారంలో పాక్ భవిష్యత్: షెహబాజ్

తాజా పరిణామాలతో పాకిస్తాన్ భవిష్యత్తు అంధకారంలో చిక్కుకున్నదని ప్రధాని షెహబాజ్ షరీఫ్ వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితుల పరిష్కారానికి ఉన్న వనరులన్నింటిని వినియోగించి తగిన చర్యలు చేపట్టడం ఎంతైనా అవసరమని అన్నారు. నాద్రా చైర్మన్ ఇక్కడున్నారా? ఆయనను సమావేశానికి ఎందుకు పిలవలేదు? ఆయన వద్ద నుంచి అన్ని వివరాలను తీసుకోండి. హింసకు బాధ్యులైన వారందరూ 72 గంటల్లో పట్టుబడాలని

లక్ష్యాన్ని నిర్దేశిస్తున్నాను. ఇది కీలకమైన క్లిష్టమైన పని. పౌరుల భద్రత దృష్ట్యా దీనిని తక్షణమే అమలు చేయాలి' అని సంబంధిత అధికారులకు ప్రధాని ఆదేశాలిచ్చారు.

ప్రజాస్వామ్యానికి సంపూర్ణ మద్దతిస్తాం: సైన్యం

దేశంలో సైనిక పాలన విధించినట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని పాకిస్తాన్ సైన్యం ప్రకటించింది. ప్రజాస్వామ్యానికి మనస్ఫూర్తిగా మద్దతిస్తామని, అకారణంగా మార్షియల్ లా విధించబోమని పేర్కొంది. ఆర్మీ డైరెక్టర్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌధురి మాట్లాడుతూ 'ఆర్మీ నాయకత్వం సంపూర్ణంగా, మనస్ఫూర్తిగా ప్రజాస్వామ్యానికి మద్దతిస్తుంది. మర్షియల్ లా అమలు ఆలోచన లేదు. అందుకు కారణం కూడా లేదు. ఈ మేరకు వచ్చే వార్తల్లో నిజం లేదు' అని అన్నారు. పాకిస్తాన్ సైన్యాన్ని ముక్తలు చేయాలన్న కొందరి కలలు... కలలుగానే మిగిలిపోతాయని ఆయన వ్యాఖ్యానించారు.

నేడు టర్కీలో ఎన్నికలు

ఇస్లాంబుల్: టర్కీలో ఆదివారం (14వ తేదీ) ఎన్నికలు జరగనున్నాయి. దేశ భవిష్యత్‌ను యువ ఓటర్లు నిర్ణయించబోతున్నారు. మొత్తం 64 మిలియన్ల మంది అర్హులైన ఓటర్లుండగా వీరిలో ఆరు మిలియన్ల మంది తొలిసారి ఓటేసేవారున్నారు. 3.4 మిలియన్ల మంది విదేశీ ఓటర్లు ఉండగా వీరంతా ముందుగానే తమ ఓటును భద్రపరిచారు. 14వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు (స్థానిక కాలమానం ప్రకారం) పోలింగ్ జరుగుతుంది. దేశంలో మొత్తం 1,90,736 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈసారి ఎన్నికలు అధ్యక్షుడు రిసెప్ తయ్యిప్ ఎర్డోగన్ 20ఏళ్ల పాలనకు చరమగీతం పాడతాయన్న ఊహాగానాలు ఉన్నాయి. పార్లమెంటరీ ఎన్నికలకు ముందు ఇస్తాంబుల్‌లో ఎర్డోగన్ మద్దతుదారులు భారీ ర్యాలీని నిర్వహించారు. దేశం ఇప్పటికే ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటతోంది. అయినాగానీ ఎర్డోగన్, ఆయన ఏకే పార్టీకి జాతీయవాదులు, మతవాదుల మద్దతున్నది. వాస్తవానికి జూన్ 18న ఎన్నికలు జరగాలి కానీ వాటిని మే 14వ తేదీకి ముందుకు నెట్టారు. టర్కీ పార్లమెంట్ 'గ్రాండ్ నేషనల్ అసెంబ్లీ'కి 600 మంది సభ్యులను ఓటర్లు ఎన్నుకోనున్నారు. ఇదిలావుంటే టర్కీ ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకుంటున్నట్లు విపక్షం ఆరోపణలు చేసింది. వాటిని క్రెమ్లిన్ తోసిపుచ్చింది. రష్యా అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ స్పందిస్తూ మిగతా దేశాల అంతర్గత వ్యవహారాల్లో రష్యా జోక్యం చేసుకోదన్నారు. ఇదంతా తప్పుడు సమాచారం అని తేల్చిచెప్పారు. విపక్ష నాయకుడు కిలిచ్దోరోగ్లు ఆరోపణలను కొట్టిపారేశారు. ప్రతిపక్ష నేత ఆరోపణలు చేశారు కానీ వాటిని బలపర్చే విధంగా ఎలాంటి

వివరాలను వెల్లడించలేదు. టర్కీ స్నేహాన్ని రష్యా కోరుకుంటోందన్నారు. టర్కీతో సంబంధాలకు రష్యా ఎంతో విలువ ఇస్తుందని చెప్పారు. కిలిచ్దోరోగ్లు అధ్యక్ష రేసులో ఉన్న విషయం విదితమే. కాగా 2018లో ఏకేపీ, ఎంహెచ్‌పీ పార్టీలు పీపుల్స్ అలయన్స్ (ప్రజా కూటమి)గా ఏర్పడి అధ్యక్ష ఎన్నికలతో పాటు పార్లమెంటరీ ఎన్నికల్లో విజయాన్ని సాధించారు. అప్పటి నుంచి ఎర్డోగన్ గురువు, మార్గదర్శి నెక్‌మెట్టిన్ ఎర్బాకన్ తనయుడు ఫతీ ఎర్బాకన్ నేతృత్వ న్యూ వెల్ఫేర్ పార్టీ, గ్రేట్ యూనిటీ పార్టీలు ఈ కూటమిలో భాగంగానే ఉన్నాయి. మరోవైపు సీహెచ్‌పీ, ఐవైపీ పార్టీ, ఫెలిసిటీ పార్టీ, డెమొక్రాట్ పార్టీలు 'ది నేషన్ అలయన్'గా ఏర్పాటయ్యాయి. ప్రస్తుత అధ్యక్ష ఎన్నికల్లో బరిలో ఉన్న కెమల్ కెలిచ్దోరోగ్లుకు ఈ కూటమి మద్దతున్నది. 2019 మున్సిపల్ ఎన్నికల్లో ఏకేపీ మేయర్ అభ్యర్థులను అంకారా, ఇస్తాంబుల్‌లో ఓడించి ఎర్డోగన్‌కు షాకిచ్చిన ఈ కూటమిలో దేవ పార్టీ, ఫ్యూచర్ పార్టీ కూడా చేరాయి.

15,16, 17 తేదీల్లో కేకేఈ ఎన్నికల ర్యాలీలు

ఏథెన్స్: గ్రీస్‌లో ఈనెల 21న పార్లమెంటరీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఇందుకు గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) పెద్దఎత్తున ప్రచారం కొనసాగిస్తోంది. ఇదే క్రమంలో ఎన్నికలకు ముందు భారీ ర్యాలీలను చేపట్టనున్నది. 17వ తేదీన ఏథేన్స్‌లో 'ఫ్రీ ఎలక్షన్ ర్యాలీ'ని భారీస్థాయిలో నిర్వహిస్తోంది. ఏథెన్స్‌లోని సింటాగ్మా స్క్వేర్‌లో బుధవారం రాత్రి 8 గంటలకు ర్యాలీ జరుగుతుందని, పార్టీ ప్రధాన కార్యదర్శి దిమిత్రీస్ కౌట్సోంబస్ పాల్గొంటారని పేర్కొంది. అదే విధంగా 15వ తేదీ రాత్రి 7.30 గంటలకు థెస్సలోనికిలో, 16వ తేదీ రాత్రి 8 గంటలకు పాత్రాస్‌లో 'పీ ఎలక్షన్' ర్యాలీలు జరుగుతాయని కేకేఈ తాజా ప్రకటనలో వెల్లడించింది.

ముగిసిన 'టైటిల్ 42'

అమల్లోకి కొత్త శరణార్థి విధానం

వాషింగ్టన్: మెక్సికోతోపాటు ఇతర దేశాల నుంచి అమెరికాకు వచ్చే శరణార్థులపై 'టైటిల్ 42' ఆంక్షలు ఆంక్షలు ముగిశాయి. కొత్త శరణార్థి విధానాన్ని అమెరికా ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చింది. 2020 మార్చిలో అమెరికాలోని ట్రంప్ ప్రభుత్వం 'టైటిల్ 42'ను అమల్లోకి తెచ్చింది. ఈ విధానం ప్రకారం అమెరికా - మెక్సికో సరిహద్దుకు వచ్చేశరణార్థులను తిరస్కరించవచ్చు. దీంతో 28 లక్షల మందికిపైగా శరణార్థులు అమెరికా ఆశ్రయాన్ని కోరి భంగపడ్డారు. ఈ మేరకు గణాంకాలు చెబుతున్నాయి. అయితే జో బైడెన్ అధికారంలోకి వచ్చాక 'టైటిల్ 42' రద్దు చేయాలనుకున్నది.

కోవిడ్ ఆంక్షలు సడలించిన నేపథ్యంలో టైటిల్ 42 స్థానంలో కొత్త నిబంధనలను తెస్తున్నట్లు ప్రకటించారు. రిపబ్లికన్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలు మాత్రం పాత విధానాన్నే కొనసాగించాలని కోరాయి. బైడెన్ ప్రభుత్వం అందుకు ఒప్పుకోలేదు. టైటిల్ 42 ఈనెల 11తో ముగిసింది. కొత్త నిబంధనల ప్రకారం. అమెరికాకు వచ్చేవారంతా ముందస్తుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అమెరికా - మెక్సికో సరిహద్దులో శరణార్థులకు పరీక్షలు నిర్వహిస్తారు. అక్రమంగా సరిహద్దు దాటితే మాత్రం ఐదేళ్ల వరకు దేశానికి రాకుండా నిషేధిస్తారు. అంతేకాకుండా క్రిమినల్ విచారణను వారు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

గిరిజన ఎమ్మెల్యేల తిరుగుబాటు

(మొదటిపేజీ తరువాయి)

మద్దతుతో యథేచ్ఛగా సుదీర్ఘకాలం కొనసాగించిందని ఎమ్మెల్యేలు ఆరోపించారు. వాస్తవంగా మెయితీల ప్రాంతం, గిరిజనులకు సంబంధించి చిన్-కుకీ-మిజో-జోర్నీ పర్వత ప్రాంతం ఇప్పటికే విడిపోయి ఉన్నాయని, ఈ గిరిజనుల ప్రాంతాన్ని మణిపూర్ నుంచి పూర్తిగా విభజించాలని విజ్ఞప్తి చేశారు. 'మా ప్రజల ప్రతినిధులుగా ఎన్నికైన మేము...వారి మనోభావాలను గౌరవించాల్సిన అవసరం ఉంది. మణిపూర్ నుంచి విడిపోవాలన్న గిరిజనుల రాజకీయ ఆకాంక్షకు మేము మద్దతిస్తున్నాం. దీనిపై మా ప్రజలతో రాజకీయ సంప్రదింపులు జరపాలని నిర్ణయించుకున్నాం' అని ఆ ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్డ్ తెగల(ఎస్‌టీ) హోదా కల్పించాలన్న మెయితీ వర్గం డిమాండ్‌కు వ్యతిరేకంగా మే 3వ తేదీన పర్వత ప్రాంత జిల్లాలలో గిరిజనుల సంఘీభావ ప్రదర్శన నిర్వహించడంతో మణిపూర్‌లో హింస చెలరేగింది. ప్రదర్శన చేస్తున్న గిరిజనులపై అగ్రవర్ణ మెయితీలు దాడులకు పాల్పడ్డారు. మణిపూర్ జనాభాలో 53 శాతం మెయితీలు ఉన్నారు. వారంతా ఇంఫాల్ లోయలో జీవిస్తున్నారు. మిగిలిన 40 శాతం గిరిజనులు- నాగాలు, కుకీలు పర్వత ప్రాంతాల్లో జీవిస్తున్నారు.

గుల్లబారిన పసుపు

(మొదటిపేజీ తరువాయి)

ఉంటుందన్నది జగమెరిగిన సత్యం. అడవికి వెళ్లాలంటే ఒంటినిండా పసుపు రాసుకొని వెళితే క్రిమికీటకాలు, దోమలు కుట్టవని పెద్దలు చెబుతారు. అమ్మవారు జల్లితే(చికెన్ పాక్స్ వస్తే) కొద్దిగా పచ్చి పసుపు, వేపాకు కలిపి నూరి, ఐదు రోజులు శరీరానికి రాస్తే చికెన్ పాక్స్ తగ్గుతుందన్నది స్థానికుల ప్రగాఢ విశ్వాసం. గిరిజన ప్రాంతంలో పండించే పసుపు పూర్తిగా సేంద్రీయ ఎరువులతో సాగవడం వలన ఈ ప్రాంత పసుపుకు వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఇంతటి ప్రత్యేకమైన మన్య ప్రాంత దేశవాళీ పసుపుకు కనీస మద్దతు ధర లేకపోవడం బాధాకరం. దానికితోడు అకాల వర్షాలకు ఉడకబెట్టిన పసుపు సరిగా ఆరకపోవడంతో సరైన రంగు రాకరాకపోవడమే కాక, గుల్లబారి పోయింది. ఇదే అదనుగా భావించిన దళారీ వ్యాపారులు పసుపు ధర బాగా తగ్గించారు. దీనితో పసుపు పండించే రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. పసుపు పండించి నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని, మన్యం ప్రాంత పసుపుకు కనీస మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

మసక బారుతున్న బాల్యం

(మొదటిపేజీ తరువాయి)

సామాజిక న్యాయానికీ అవరోధంగా మారింది. బాలలు గౌరవప్రదంగా జీవించే హక్కును కాలరాస్తోంది. మన దేశంలో 1986, 2016 సంవత్సరాలలో బాల కార్మిక (నిషేధం, నియంత్రణ) చట్టాన్ని, 2009లో విద్యా హక్కు చట్టాన్ని రూపొందించినప్పటికీ దేశంలోని బాలలు అక్రమ రవాణాకు గురవుతూనే ఉన్నారు. విద్యకు దూరమై నిరక్షరాస్యులుగా మిగులుతున్నారు. వారి శారీరక-మానసిక ఆరోగ్యం బలహీనమవుతోంది. చిన్నారులు అందమైన బాల్యాన్ని కోల్పోవడంతో భవిష్యత్తులో నాణ్యమైన మానవ వనరుల పెట్టుబడిని రాబట్టే విషయంలో రాజీ పడాల్సి వస్తోంది. భారత్‌లో బాల కార్మికుల సంఖ్య ప్రస్తుతం అనేక దేశాల జనాభాను దాటి పోయింది. దేశంలో సుమారు 78 లక్షల మంది బాల కార్మికులు ఉన్నారు. వీరిలో 57 శాతం మంది బాలలు కాగా మిగిలిన 43 శాతం మంది బాలికలు. 2021లో జనాభా లెక్కల సేకరణ జరగకపోవడంతో బాల కార్మికుల కచ్చితమైన సంఖ్య తెలియడం లేదు. బాల్యం ఛిద్రమవడానికి పేదరికమే కారణం. బాలలు విద్య, ఆరోగ్యం, సామాజిక-ఆర్థిక అవకాశాలు వంటి విషయాలలో రాజీ పడాల్సి వస్తోంది. జీవితంలో ఎన్నో అవకాశాలను కోల్పోవాల్సి వస్తోంది. సమాన అవకాశాల విషయంలో బాలలకు ఉండే హక్కులు ఉల్లంఘనకు గురవుతున్నాయి. శ్రమ దోపిడీ పెరుగుతోంది. భారత రాజ్యాంగం ప్రకారం 6-14 సంవత్సరాల మధ్య వయసున్న పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్యను అందించాల్సి ఉంటుంది. అయితే అది అమలుకు నోచుకోవడం లేదు. ఫలితంగా బాల కార్మికుల సంఖ్య పెరుగుతోంది. వారి ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతోంది. పైగా బడి పిల్లలకు ఉచితంగా బట్టలు, ఆహారం, ఇతర అవసరాలను సమకూర్చడంలో కూడా వైఫల్యం కనిపిస్తోంది. విద్యా రంగంలో పురోభివృద్ధి సాధించామని చెప్పుకుంటున్నప్పటికీ పిల్లలు పెద్ద సంఖ్యలో మౌలిక విద్యకు దూరమవుతున్నారు.

కోరలు లేని చట్టాలు

దేశంలో బాల కార్మిక చట్టాలు ఈ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు ఉపయోగపడటం లేదు. 1986లో వచ్చిన చట్టంతో పోలిస్తే 2016లో వచ్చిన కొత్త చట్టం విద్యా హక్కుకు భంగం కలిగించే ఏ విధమైన పనిని బాలలతో చేయించరాదని నిర్దేశిస్తోంది. అయితే ఈ చట్టంలో అస్పష్టతలు కనిపిస్తున్నాయి. బాలలతో పని చేయించడానికి కనీస వయసును ఇందులో నిర్ణయించలేదు. ప్రమాదకరమైన వృత్తిలో బాలలు ఉపాధి పొందడాన్ని నిషేధించ లేదు. కుటుంబ పనులలో వారిని భాగస్వాములను చేయడంపై కూడా ఎలాంటి ఆంక్షలు విధించలేదు. దీంతో ఈ చట్టం అమలు ఓ అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి అన్న చందంగా మారింది. దేశంలో బాల కార్మిక వ్యవస్థను రూపుమాపే విషయంలో చిత్తశుద్ధితో కూడిన ప్రయత్నాలు లోపించాయని అర్థమవుతోంది. 80 లక్షల మంది బాలల ప్రాథమిక హక్కులకు భంగం వాటిలుతున్న నేపథ్యంలో ఈ సమస్య పరిష్కారానికి దేశంలోని అన్ని విభాగాలు నడుం బిగించాల్సిన అవసరం ఉంది. యుద్ధ ప్రాతిపదికన సమస్యను పరిష్కరించాలంటే ముందుగా బాల కార్మి కులను గుర్తించాలి. అన్ని విభాగాలు జోక్యం చేసుకొని, అవసరమైన చర్యలు చేపట్టాలి.

రూ.12 వేల కోట్ల డ్రగ్స్ పట్టివేత

న్యూఢిల్లీ : కేరళ తీరంలో భారీగా మాదకద్రవ్యాలు పట్టుబడ్డాయి. నావికాదళం, మాదక ద్రవ్యాల నియంత్రణ సంస్థ (ఎన్‌సీబీ) సంయుక్తంగా నిర్వహించిన భారీ మాదకద్రవ్యాల తనిఖీలో కేరళ తీరం వెంబడి భారతీయ జలాల్లోని ఓడలో దాదాపు రూ.12,000 కోట్ల విలువైన దాదాపు 2,500 కిలోల మెథాంఫెటమైన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు మాదక ద్రవ్యాల నిరోధక సంస్థ శనివారం తెలిపింది. దేశంలో ఇదే అతిపెద్ద మెథాంఫేటమిన్ స్వాధీనం అని, దీనికి సంబంధించి ఒక పాకిస్తాన్ జాతీయుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపింది. ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్‌సీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న వివరాలను తెలియజేస్తూ, అఫ్ఘనిస్తాన్ నుంచి ఉత్పన్నమయ్యే మాదకద్రవ్యాల సముద్ర అక్రమ రవాణాను లక్ష్యంగా చేసుకున్న 'ఆపరేషన్ సముద్రగుప్త్' లో భాగంగా ఇది జరిగిందని చెప్పారు. గత ఏడాదిన్నర కాలంలో దక్షిణాది మార్గంలో సముద్రంలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా ఎన్‌సీబీకి పట్టుబడడం ఇది మూడోసారి అని వివరించింది. ఆపరేషన్‌లో భాగంగా ఇప్పటివరకు 3,200 కిలోల మెథాంఫెటమైన్, 500 కిలోల హెరాయిన్, 529 కిలోల హషీష్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. తాజా మాదకద్రవ్యాలు అఫ్ఘనిస్తాన్ నుంచి భారతదేశం, శ్రీలంక, మాల్దీవులకు ఉద్దేశించినవి అని పేర్కొంది. పాకిస్తాన్, ఇరాన్ చుట్టూ ఉన్న మక్రాన్ తీరం నుంచి ప్రయాణంలో వివిధ పడవలకు మాదక ద్రవ్యాలను పంపిణీ చేసే ఒక పెద్ద నౌక అయిన 'మదర్ షిప్'లో ఈ డ్రగ్ అక్రమ రవాణా ప్రారంభమైందని తెలిపింది. నావికాదళం 134 అనుమానిత మెథాంఫెటమైన్ బస్తాలు, పాకిస్తాన్ జాతీయుడు, అడ్డగించిన పడవ, ఓడ నుంచి స్వాధీనం చేసుకున్న మరికొన్ని వస్తువులను కేరళలోని కొచ్చిలో మట్టన్‌చేరి వార్ఫ్‌కు తీసుకువచ్చి ఎన్‌సీబీకి అప్పగించినట్లు తెలిపింది. కాగా నిందితులను అరెస్టు చేసే ప్రక్రియలను ప్రారంభించింది. ప్రాథమిక విశ్లేషణ ఏమిటంటే అన్ని ప్యాకెట్లలో అధిక స్వచ్ఛత కలిగిన మెథాంఫేటమిన్ ఉందని సమాచారం.

ఆపరేషన్ సముద్ర గుప్త్‌లో భాగంగా ఒక సమాచారాన్ని అనుసరించి, భారత నావికాదళం ఇంటెలిజెన్స్ విభాగం సమన్వయంతో ఎన్‌సీబీ సంయుక్త ఆపరేషన్‌ను ప్రారంభించింది. ఈ వివరాలను భారత నావికాదళంతో పంచుకున్నారు. చుట్టుపక్కల ఒక భారతీయ నావికాదళ నౌకను మోహరించారు. మక్రాన్ తీరం నుంచి భారీ మొత్తంలో మెథాంఫెటమైన్‌ను తీసుకువెళుతున్న 'మదర్ షిప్'ను అడ్డగించి భారీ మొత్తంలో మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు.

కోర్టు తీర్పు బేఖాతర్

(మొదటిపేజీ తరువాయి)

అడ్డుకున్నారు. ఆ తర్వాత పరిమిత సంఖ్యలో స్మృతివనం వెళ్లేందుకు అనుమతించారు. దీంతో పరిస్థితి సద్దుమణిగింది. అనంతరం అమరావతి జేఏసీ నేతలు స్మృతివనం వద్దకు వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నినాదాలు చేశారు. మరోపక్క దొండపాడులోనూ ఉద్రిక్తత చోటుచేసుకుంది. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రైతులపై పోలీసులు జులుం ప్రదర్శించారు. రైతులను బలవంతంగా వాహనంలోకి ఎక్కించారు. పోలీసుల తీరుపై రాజధాని రైతుల మండిపడ్డారు. రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులను, అమరావతిని నాశనం చేయడానికే రాష్ట్ర ప్రభుత్వం ఆర్-5 జోన్‌ను తీసుకువచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చావడానికైనా సిద్ధపడతాం కాని పనులు చేస్తే ఊరుకోబోమని మహిళలు పెట్రోల్ సీసాలు పట్టుకుని హెచ్చరించారు. నెక్కల్లు, అనంతవరం గ్రామాల్లో జంగిల్ క్లియర్స్‌ను అడ్డుకున్నారు. పోలీసులు వారించినా వినకుండా రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. రైతులపై పగ, ప్రతీకారాలతోనే సీఎం రాజధాని విధ్వంసానికి పూనుకుంటున్నారని మండిపడ్డారు. దొండపాడులోనూ సీడ్ యాక్సెస్ రోడ్డుపై టెంటు వేసి రైతులు నిరసన తెలిపారు.

జడ శ్రావణ్‌కుమార్ అరెస్ట్

ఆర్-5 జోన్‌కు వ్యతిరేకంగా జడ శ్రావణ్‌కుమార్ తలపెట్టిన పాదయాత్రను పోలీసులు భగ్నం చేశారు. 'న్యాయం కోసం నేను సైతం'

పేరిట శనివారం విజయవాడ నుంచి అమరావతిలో అంబేద్కర్ స్మృతివనం వరకు పాదయాత్ర చేయాలని ఆయన నిర్ణయించారు. విజయవాడ నుంచి బయల్దేరేందుకు సిద్ధమవుతుండగానే శ్రావణ్ బస చేసిన హోటల్ ముందు పోలీసులు భారీగా మోహరించారు. ఆ తర్వాత ఆయన్ను అరెస్ట్ చేసి భవానీపురం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసుల వైఖరిని శ్రావణ్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. పోలీసులు అన్యాయంగా తనను అరెస్ట్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన అక్రమ అరెస్ట్‌కు నిరసనగా ఆమరణదీక్షకు దిగుతున్నట్లు ప్రకటించారు. తనను పోలీస్‌స్టేషన్‌లో ఉంచినా... జైల్లో పెట్టినా...ఎక్కడికి తీసుకెళ్లినా దీక్ష కొనసాగుతుందని శ్రావణ్ స్పష్టం చేశారు. రైతులకు మద్దతివ్వడమే తాను చేసిన నేరమా అని ఆయన ప్రశ్నించారు.

కర్నాటక హస్త గతం

(మొదటిపేజీ తరువాయి)

జేడీ(ఎస్) 19 స్థానాలలో గెలిచింది. గతసారితో పోల్చితే దాదాపు 17స్థానాలను కోల్పోయింది. అటు బీజేపీ కూడా 2018లో 108 స్థానాల్లో గెలవగా ప్రస్తుతం 65 స్థానాలతో సరిపెట్టుకున్నది. మరో 4 స్థానాల్లో ఇతరులు గెలిచారు.

ప్రధాని మోది కర్నాటకలో ప్రచారం చేసినంతగా తన సొంత రాష్ట్రం గుజరాత్‌లో కూడా చేసివుండరు.సాధారణంగా ప్రధాని హోదాలో ఏదో రెండు బహిరంగ సభలు, నాలుగు రోడ్ షోల్లో పాల్గొని సరిపెట్టుకుంటారు. అయితే, కర్నాటకలో ఎలాగైనా విజయంసాధించాలని వీధినాయకుడు తిరిగినట్టు గల్లీ గల్లీ తిరిగి ప్రధాని ఎన్నికల ప్రచారం చేశారు. ఏకంగా 20 బహిరంగ సభల్లో పాల్గొని ప్రసంగించారు. దీనికితోడు ప్రతి చోటా రోడ్ షో నిర్వహించారు. ఎన్నికల సమయంలో మోదీతో పాటు మొత్తం జాతీయ స్థాయి నేతలంతా కర్నాటకలోనే ఉన్నారు. ఇన్ని చేసినా కన్నడ ప్రజలు బీజేపీని తిరస్కరించారు, అంచనాలకు మించి కాంగ్రెస్‌కు విజయం చేకూర్చారు.

వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగాల్సి ఉండటంతో కర్నాటకలో కాంగ్రెస్ గెలుపు ఆ పార్టీలో నూతనోత్సాహాన్ని నింపింది. బెంగళూరు నుంచి బికానీర్ వరకు రాంచీ నుంచి అహ్మదాబాద్ వరకు పార్టీ శ్రేణులు సంబరాలలో మునిగిపోయారు. ఆటపాటలు, మేళతాళాలు, బణాసంచా పేలుళ్లతో తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. అయితే ముఖ్యమంత్రి ఎవరన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. త్వరలోనే ముఖ్యమంత్రి ఎవరో ప్రకటిస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పారు. ఈ గెలుపుకు ప్రజలే కారణమని, ఈ ఘనత వారిదేనని అన్నారు. నాయకులంతా ఐక్యంగా పనిచేశారని, తమ హామీలపై నమ్మకం ఉంచి జనం ఓట్లు వేశారని చెప్పారు. 2024 లోక్‌సభ ఎన్నికల దిశగా కాంగ్రెస్ మరో ముందుడుగు వేసిందని కాంగ్రెస్-కర్నాటక సీనియర్ నేత సిద్దరామయ్య అన్నారు. బీజేపీ వారు తనను జైల్లో పెట్టినప్పుడు సోనియాగాంధీ వచ్చి కలిశారని, అది ఎప్పటికీ మరువలేనని సీఎం రేసులో ఉన్న సీనియర్ నేత డీకే శివకుమార్ భావోద్వేగానికి గురయ్యారు. తమ విజయం విద్వేషానికి అంతం... ప్రేమకు నాందికి సంకేతమని పార్టీ మాజీ

అధ్యక్షుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. కర్నాటకలో గెలుపుపై అమితానందాన్ని వ్యక్తంచేశారు. భారత్ జోడో యాత్ర ద్వారా కాంగ్రెస్ పార్టీకి ఎంతగానో కలిసివచ్చిందని సీనియర్ నేత జైరాం రమేశ్ అన్నారు. తమ పార్టీకి అది సంజీవనిలా పనిచేసిందని చెప్పారు. మరోవైపు తమ ఓటమిపై ఆత్మవిమర్శ చేసుకుంటామని బీజేపీ సీఎం బసవరాజ్ బొమ్మై అన్నారు. ఇది వ్యక్తిగత ఓటమే తప్ప పార్టీ సిద్ధాంతాల ఓటమి కాదని మరికొందరు సీనియర్లు వ్యాఖ్యానించారు. కింగ్ మేకర్ అని చెప్పుకున్న జేడీఎస్ కేవలం 19 స్థానాలకు పరిమితం కాగా పార్టీ ఓటుశాతం 18.36శాతం నుంచి 13.3శాతానికి పడిపోయింది.

కర్నాటకలో కాంగ్రెస్ గెలుపును వామపక్షాలు, జేడీయూ, టీఎంసీ, పీడీపీ, ఎస్పీ, డీఎంకే తదితర పార్టీలు ప్రశంసించాయి. ద్రవ్యోల్బనం, అవినీతి, నిరుద్యోగం, విద్వేషంతో అల్లాడిపోతున్న దేశంలో కొత్త ఆశలు కాంగ్రెస్ గెలుపుతో చిగురించాయని వ్యాఖ్యానించారు. మోదీ అజేయుడు కాదని తేలిపోయిందని సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం అన్నారు. కాగా, పూర్తి మెజారిటీలో అధికారంలోకి రావాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీతో సహా ప్రధాన పార్టీలన్నీ పెద్దఎత్తున ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించిన విషయం విదితమే. కాగా, రాష్ట్రంలో ఓట్ల లెక్కింపు 36 రాష్ట్రాల్లో పకడ్బందీ భద్రత నడుమ జరిగింది. ఈనెల 10న జరిగిన ఎన్నికల్లో 73.19శాతం పోలింగ్ నమోదు అయింది.

కాంగ్రెస్‌ను అభినందించిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ : కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించినందుకు కాంగ్రెస్‌ను ప్రధాని నరేంద్ర మోదీ శనివారం అభినందించారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే ప్రయత్నంలో కాంగ్రెస్ పార్టీకి శుభాకాంక్షలు తెలిపారు. 'కర్నాటక ఎన్నికల్లో మాకు మద్దతిచ్చిన వారందరికీ ధన్యవాదాలు. బీజేపీ కార్యకర్తల కృషిని అభినందిస్తున్నాను. రాబోయే కాలంలో మరింత శక్తితో కర్ణాటకకు సేవ చేస్తాం' అని ఆయన మరో ట్వీట్‌లో పేర్కొన్నారు.

మోదీ అజేయుడేమీ కాదు: ఎంపీ వినయ్ విశ్వం

న్యూఢిల్లీ: కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం పట్ల ప్రతిపక్షాలు హర్షం వ్యక్తంచేశాయి. కాంగ్రెస్‌ను గెలిపించినందుకు కన్నడ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ విజేయుడు కాదని ఈ ఫలితాలు రుజువు చేశాయని వ్యాఖ్యానించాయి. కర్నాటకలో కాంగ్రెస్ చారిత్రక విజయానికి పేదల అనుకూల హామీలు, లౌకికవాద వైఖరి దోహదపడిందని సీపీఐ రాజ్యసభ ఎంపీ వినయ్ విశ్వం చెప్పారు. కర్నాటక ఎన్నికల ఫలితాలపై వినయ్ విశ్వం శనివారం స్పందిస్తూ మోదీ సర్కారును ఓడించటం పెద్దకష్టమేమీ కాదని కాంగ్రెస్ విజయం నిరూపించిందన్నారు. ప్రతిపక్షలన్నీ అవసరమైన గుణపాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉందని, అదేసమయంలో జాతీయ రాజకీయాలపై మరింత బాధ్యతాయుతంగా వ్యవహించాలని హితవు పలికారు. లౌకికశక్తులన్నీ ఏకతాటిపైకి వస్తే 2024లో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడం కష్టమేమీ కాదని వినయ్ విశ్వం చెప్పారు. 'కర్నాటకకు ధన్యవాదాలు. బజరంగ్‌బళీజీకి బదులు ఎల్‌పీజీని ఎంపికచేసుకున్నారు' అని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా ట్వీట్ చేశారు. బీజేపీని ఓడించి...కాంగ్రెస్‌ను ఎన్నుకున్న కర్నాటక ప్రజలకు సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య ధన్యవాదాలు తెలిపారు. 'అవినీతిని తిప్పికొట్టడమే కాకుండా బొమ్మై ప్రభుత్వ పాలనను తిరస్కరించినందుకు కర్నాటకకు ధన్యవాదాలు. విద్వేషం, అహంకారంతో నిండిన మోదీ-షా ద్వయం ప్రచారాన్ని కన్నడ ప్రజలు నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంసిద్ధం కావడానికి, దేశంలోని ప్రజాస్వామిక సమర్థకులకు గొప్ప ప్రోత్సాహకరం'

విద్వేషానికి ముగింపు... ప్రేమకు నాంది

(మొదటిపేజీ తరువాయి)

224 అసెంబ్లీ స్థానాలకు గానూ కాంగ్రెస్ 136 స్థానాలో విజయం సాధించగా, బీజేపీ 65 స్థానాలకే పరిమితమైంది. ఇక జేడీ(ఎస్) 19 స్థానాలను దక్కించుకుంది. ఇతరులు నాలుగు స్థానంలో విజయం సాధించారు. రాహుల్ ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ 'కర్నాటక ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు, నాయకులకు నా ధన్యవాదాలు, అభినందనలు తెలియజేస్తున్నాను' అని తెలిపారు. 'మేము ద్వేషం, చెడు పదాలు ఉపయోగించకుండా కర్నాటక ఎన్నికల్లో పోటీ చేసినందుకు సంతోషంగా ఉన్నాము. మేము ప్రేమతో ఎన్నికల్లో పోరాడాము. కర్నాటకలో 'నఫ్రత్ కా బజార్ (ద్వేషపూరిత మార్కెట్)' మూతపడింది. మొహబ్బత్ కి దుకానీన్' (ప్రేమ దుకాణాలు) తెరుచుకున్నాయి' అని అన్నారు

మా ఐదు వాగ్దాలను తొలి కేబినెట్‌లోనే నెరవేరుస్తాం

కర్నాటకలో కుటిల పెట్టుబడిదారులకు, పేదలకు మధ్య యుద్ధం జరిగిందని రాహుల్ అన్నారు. పేద ప్రజలు కర్నాటకలో కుటిల పెట్టుబడిదారులను ఓడించారని, బలవంతులపై పేదల శక్తే గెలిచిందని చెప్పారు. కాంగ్రెస్ పేదల తరపున పోరాడిందని చెప్పారు. తాము ఈ యుద్ధంలో ద్వేషంతో బరిలో దిగలేదని... ప్రేమ, అప్యాయతతో పోటీ చేశామని అన్నారు. భవిష్యత్‌లోనూ ఇవే ఫలితాలు వస్తాయని దీమా వ్యక్తం చేశారు. ఇది కర్నాటక విజయం అని అన్నారు. కర్నాటక ప్రజలకు తాము ఇచ్చిన ఐదు వాగ్దానాలను తొలి కేబినెట్ భేటీలోనే నేరవేరుస్తామని చెప్పారు.

ప్రధానికి నైతిక ఓటమి

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికలలో ప్రధాని మోదీ ఎక్కువ రోజులు అక్కడే ఉండి కులాలు , మతాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని అన్నారు. రాజ్యాంగంలోని లౌకికవాదానికి కట్టుబడి ఉండాల్సిన ప్రధాని ఓట్ల కోసం కక్కుర్తి పడి బజరంగ్ జై అనమన్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ పట్ల బీజేపీ చేపట్టిన కక్ష సాధింపు చర్యల సానుభూతి కూడా కాంగ్రెస్‌కు కలిసివచ్చిందన్నారు. పెరిగిన వంటగ్యాస్, పెట్రోలు ధరలు పై వ్యతిరేకత కూడా బీజేపీని ఓడించిందన్నారు. కర్నాటకలో బీజేపీ ఓటమి దేశవ్యాప్తంగా ప్రభావం చూపుతుందని నారాయణ అన్నారు.

రామకృష్ణకు గిరిజన నేతల కృతజ్ఞతలు

విశాలాంధ్ర-చిలకలూరిపేట: జీవో నంబర్ ఒకటిపై పోరాటం చేసి విజయం సాధించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణను గిరిజన నేతలు అభినందించారు. ప్రజాస్వామ్య హక్కులను రామకృష్ణ కాపాడారని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి.శ్రీను నాయక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్-1పై రామకృష్ణతోపాటు ఆయా రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నేతలు విజయవాడ సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో రామకృష్ణను కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శ్రీనునాయక్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య హక్కుల సాధనకు కలిసి రావాలని కోరారు. అఖిలభారత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యునైటెడ్ ఫోరం రాష్ట్ర మహిళా నాయకురాలు నూతక్కి కృష్ణరేఖ పాల్గొన్నారు.

భవన కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

రేపటి ధర్నాలకు ఏఐటీయూసీ మద్దతు: ఓబులేసు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : సంక్షేమ బోర్డు పునరుద్ధరణ, పెండింగ్ క్లెయిమ్‌ల సాధన కోసం ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన ఈ నెల 15వ తేదీన అన్ని జిల్లా కలెక్టర్ల కార్యాలయాల ఎదుట సాగిస్తున్న ధర్నాలకు ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమాల్లో పెద్దసంఖ్యలో పాల్గొనాలని అన్ని జిల్లాల ఏఐటీయూసీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జూన్ 6వ తేదీన విజయవాడలో భవన నిర్మాణ కార్మికులు చేస్తున్న మహా ధర్నాకు రాష్ట్ర నలుమూలల నుంచి కార్మికులు అధిక సంఖ్యలో రావాలని, ఆ ధర్నా విజయవంతం అయితే ప్రభుత్వానికి కనువిప్పు కలుగుతుందని తెలిపారు. కార్మికులు సంక్షేమ బోర్డుకు కట్టిన సొమ్ముతో పాటు, గృహ నిర్మాణాలు జరుగుతున్న చోట్ల భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం వసూలు చేసిన సెస్సు డబ్బులు రాష్ట్ర ప్రభుత్వ వాడుకోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఓబులేసు హెచ్చరించారు.భవన నిర్మాణ కార్మికులు ఇసుక కొరత వల్ల ,పనులు లేక ఉపాధి లేక అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని, ఇప్పటికే రాష్ట్రంలో 32 మంది ఆత్మహత్య చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అయినా రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలగలేదన్నారు. మరోవైపు స్టీలు, సిమెంటు మొదలగు గృహ నిర్మాణానికి అవసరమయ్యే అన్ని రకాల వస్తువుల ధరలను విపరీతంగా పెంచారని, ఆ ధరలు నియంత్రించడం కూడా జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి చేతకావడం లేదని ఓబులేసు విమర్శించారు.

జర్నలిస్టుల ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

- తొలిరోజు 1120 మందికి పరీక్షలు
- శిబిరాన్ని సందర్శించిన మంత్రులు చెల్లుబోయిన, రజిని

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. విజయవాడ ఆంధ్రా లయోలా ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం ప్రారంభమైన రెండురోజుల ఉచిత వైద్య శిబిరంలో తొలిరోజు 1,120 మంది జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు ఉచిత వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు వెల్లడించారు. వైద్య శిబిరం ప్రారంభోత్సవానికి రాష్ట్ర మంత్రులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ, విడదల రజిని, ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు, హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో హరీంద్రప్రసాద్ తదితరులు సందర్శించారు. మంత్రులు, ఐఅండ్‌పీఆర్ కమిషనర్ టి.విజయకుమార్ రెడ్డి కూడా జర్నలిస్టులతో కలిసి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... జర్నలిస్టుల ఉద్యోగం కత్తి మీద సాములాంటిదన్నారు. తీవ్రమైన పని ఒత్తిడితో సకాలంలో ఆహారం తినకుండా ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా విధుల్లో నిమగ్నమవుతారన్నారు. జర్నలిస్టుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని చేపట్టిన ఈ ఉచిత శిబిరాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు. సుమారు రూ.10వేల విలువైన వైద్య పరీక్షలను ఉచితంగా చేస్తున్నారని, అవసరమైన వారికి హెల్త్ కార్డు ద్వారా శస్త్ర చికిత్సలు కూడా చేయనున్నట్లు చెప్పారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగిన ఈ శిబిరంలో నగరంలోని ప్రముఖ హాస్పిటల్స్ పిన్నమనేని ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, స్మైల్ హాస్పిటల్, శంకర నేత్ర చికిత్సాలయ, మాక్స్ విజన్ ఐ హాస్పిటల్, అన్ను ఆర్థో అండ్ ఈఎన్‌టీ, ఆంధ్రా హాస్పిటల్స్, సెంటిని హాస్పిటల్, కామినేని, కేపిటల్ హాస్పిటల్, ఆపిల్ డెంటల్ కేర్, పార్థ డెంటల్ కేర్, ఉషా కార్డియాక్ సెంటర్, అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్, ఇండో బ్రిటీష్ హాస్పిటల్, హెచ్ సీజీ క్యూరీ సిటీ క్యాన్సర్ సెంటర్, గ్లోబల్ ఎంటర్ ప్రైసెస్ హార్ట్ కేర్ సెంటర్, సన్ రైజ్ హాస్పిటల్, స్వర సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, అను హాస్పిటల్, శ్రీధర్ డెంటల్ హాస్పిటల్, మణిపాల్, గ్రేస్ హో క్యాన్సర్ మొబైల్ కేర్ యూనిట్స్ తదితర హాస్పిటల్స్ వైద్య సిబ్బంది ఈ శిబిరంలో పాల్గొని సేవలందించారు. తొలిరోజు వైద్య పరీక్షలు చేయించుకున్న జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల వైద్య నివేదికలు వెలువడిన అనంతరం ఆదివారం ఉదయం 7 గంటల నుంచి వైద్యులచే కన్సల్టేషన్ ఉంటుందని కమిషనర్ విజయకుమార్ రెడ్డి తెలిపారు.

కర్నాటక ఫలితాలతోనైనా

ప్రాంతీయ పార్టీలు బీజేపీకి దూరం కావాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కర్నాటక అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ ఘోరంగా ఓడిపోవడం పట్ల సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ నిరంకుశ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఇచ్చిన తీర్పు ఇది. దీన్ని గుణపాఠంగా తీసుకుని మన రాష్ట్రంలో కూడా ప్రధాన రాజకీయ పార్టీలు అవకాశవాదంతో బీజేపీతో అంటకాగడం మానుకొని ఆంధ్రప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ముందుకు రావాలని కోరారు. ఏపీలో ప్రధాన పార్టీలైన వైసీపీ, టీడీపీ, జనసేన తమ అవకాశవాదంతో మోదీని ప్రసన్నం చేసుకోవడానికి ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం చేసే దాడులకు భయపడి ఏంచెప్పినా తాళం వేస్తున్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కంటే వారి స్వప్రయోజనాలకే విలువిస్తున్నారన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో కూడా మత ఘర్షణలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్న బీజేపీకి మద్దతునిస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. కర్నాటక ఎన్నికల ఫలితాలతోనైనా ఈ పార్టీలు కళ్లు తెరవాలన్నారు. బీజేపీ చేస్తున్న మోసాన్ని, రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై నిలదీయాలనీ, రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు పూనుకోవాలని ఆయన కోరారు. దేశ రాజకీయాలలో కర్నాటక ఫలితాలు ఒక మలుపన్నారు. కేంద్రంలో బీజేపీ నిరంకుశ పాలనకు ఘోరీ కట్టడానికి కర్నాటక ఎన్నికల ఫలితాలే నాందిగా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్టు

రూ.80 లక్షల నగదు, వాహనాలు స్వాధీనం

విశాలాంధ్ర-ఆదోని: ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న బోయ మహానంది, పింజరి హుసేన్, పింజరి ఖాసీం, మహబూబ్‌నగర్ జిల్లా ఐజకు చెందిన వడ్ల రాఘవేంద్రాచారిలను అరెస్టు చేశామని, రూ.80 లక్షల నగదుతో పాటు ఎక్స్‌యువీ-500 కారు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి, సీఐ శ్రీరామ్ చెప్పారు. మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. అక్రమ సంపాదనే ధ్యేయంగా వడ్ల రాఘవేంద్రాచారి కొన్నేళ్లుగా రూ.1000కి రూ.300 కమీషన్‌తో వేర్వేరు ప్రాంతాల్లో క్రికెట్ బుకీలను ఏర్పాటు చేసుకున్నాడు. బోయ మహానంది, ఆయన కొడుకు రమేశ్, పింజరి మహమ్మద్ ఖాసీం, పింజరి హుసేన్ అలియాస్ చిడ్డు, ఇస్మాయిల్, గొల్ల భీమా, ప్రతాప్, శ్రీనివాసులు, గౌడవల్లిలను ఏజెంట్లుగా నియమించుకున్నాడని డీఎస్పీ తెలిపారు. నిందితులు నేషనల్ ఎక్స్‌చేంజ్. 9.సీఓ అనే వెబ్‌సైట్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారని, బోయ మహానంది నుండి రూ.30లక్షల నగదుతో పాటు కారు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. గతంలో అతనిపై ఆదోని, కోసిగి పోలీస్‌స్టేషన్‌లలో 8 కేసులు నమోదయ్యాయని తెలిపారు. పింజరి హుసేన్ నుండి రూ.10లక్షలు, పింజరి మహ్మద్ ఖాసీం నుండి రూ.10 లక్షలు స్వాధీనం చేసుకున్నామని, వారిపైనా గతంలో క్రికెట్ బెట్టింగ్ కేసులు నమోదయ్యాయన్నారు. వడ్ల రాఘవేంద్రాచారి నుండి రూ.30 లక్షల నగదుతో పాటు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పరారీలో ఉన్న బోయ రమేశ్, ఇస్మాయిల్, గొల్ల భీమా, ప్రతాప్, శ్రీనివాసులు, గౌడవల్లి కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని, త్వరలో అరెస్టు చేస్తామన్నారు. నిందితులను అరెస్టు చేసిన సీఐ శ్రీరామ్, ఎస్ఐ పీరయ్యలను కర్నూలు ఎస్పీ కృష్ణకాంత్ అభినందించారని, కానిస్టేబుళ్లు నరేంద్ర, మధు, సోమేశ్, ఖాసింవలీ, నరసింహ, మంజుకుమార్, మురళిలకు రివార్డులు అందజేసినట్లు డీఎస్పీ తెలిపారు.

టీడీపీ, జనసేన, వామపక్షాలు కలిసి

వైసీపీని గద్దె దించాలి

రైతునేత వడ్డే, సామాజిక ఉద్యమ నేత లక్ష్మీనారాయణ

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): టీడీపీ, జనసేన, వామపక్షాలు కలిసి ఎన్నికల బరిలో దిగితే రాష్ట్రంలో అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించవచ్చని రైతు నాయకుడు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, సామాజిక ఉద్యమనేత టి.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వడ్డే మాట్లాడుతూ కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి కర్ణాటక రైతు సంఘాలు చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఆ రాష్ట్రంలో అమూల్ సంస్థను తీసుకురావాలని చూస్తే... అక్కడి ప్రజలు, రైతులు స్థానిక నందిని సంస్థకు అండగా నిలిచి ప్రభుత్వ నిర్ణయాన్ని తిప్పి కొట్టారన్నారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా అమూల్ సంస్థకు అన్ని విధాలా సహకరిస్తూ స్థానిక డెయిరీలను దెబ్బ కొట్టే విధంగా చర్యలు తీసుకున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై కర్ణాటక ప్రజలు బీజేపీకి బుద్ధి చెప్పాలని నిర్ణయించుకునే కాంగ్రెస్ ను గెలిపించారన్నారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఇటీవల ఒక జాతీయ ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ ఎన్డీయే విధానాలకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని చెప్పడాన్ని టీడీపీ సానుభూతిపరులుగా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సహా విభజన హామీలను నెరవేర్చని, విశాఖ స్టీల్ ఫ్యాక్టరీని అమ్మేస్తామన్న మోదీ ప్రభుత్వ విధానాలను మెచ్చుకోవడం సరికాదన్నారు. చంద్రబాబు సరైన నిర్ణయాలు తీసుకోకపోతే చెప్పాల్సిన బాధ్యత టీడీపీ మద్దతుదారుగా నా బాధ్యత అన్నారు. బీజేపీ, జనసేన, టీడీపీ మూడు కలిసి వైసీపీని గద్దె దింపుతాయన్న పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై స్పందిస్తూ... బీజేపీ లేకుండా వైసీపీని గద్దె దింపలేరా అని ప్రశ్నించారు. ప్రజల్లో వైసీపీపై తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. జగన్ ఏ విధంగా వ్యవహరిస్తున్నారో అదే విధంగా కేంద్రం లో మోదీ వ్యవహార శైలి ఉందని, ఇక్కడ వైసీపీ చేసేది తప్పు అయితే, అక్కడ బీజేపీ చేస్తుంది ఒప్పా అనేది పవన్ కల్యాణ్ చెప్పాలన్నారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడం, పేదవారి తిండిపై కూడా జీఎస్టీ వేసి పిప్పి చేస్తున్న బీజేపీతో రాష్ట్రంలో పొత్తు ఎలాగో పవన్ కల్యాణ్ ఆలోచించాలని సూచించారు. టీడీపీ, జనసేన, వామపక్ష పార్టీలు కలిస్తే వైసీపీని గద్దె దింపొచ్చునన్నారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... రాజ్యాంగ సూత్రాలను ధిక్కరిస్తూ, పత్రికా స్వాతంత్ర్యాన్ని తుంగలో తొక్కి, ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా అదానీ, అంబానీలకు కట్టబెట్టుకు తున్న మోదీని గద్దె దించేందుకు సాగనున్న పోరాటంలో తొలి విజయం సాధించినందుకు కర్ణాటక రైతులకు, ప్రజలకు జేజేలు అన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఎగ్గొట్టి, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమల సత్వర అభివృద్ధికి కోరాపుట్- బోలంగీర్ లకు ఇచ్చిన విధంగా నిధులను ఇవ్వాలని, వైజాగ్ రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని విభజన చట్టంలో ఉన్నప్పటికీ... అమలు చేయకుండా అసామాన్య త్యాగాలతో ఆంధ్రులు సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కారుచౌకగా అమ్మేయడానికి నిర్ణయం తీసుకున్న బీజేపీతో పవన్ కల్యాణ్ పొత్తు పెట్టుకుంటామనడం సరికాదన్నారు. జనసేన, టీడీపీ, వామపక్షాలు కలిసి జగన్మోహన్ రెడ్డిని గద్దె దించేందుకు కృషిచేయాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నేతి మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి వెళదాం

కార్యకర్తలకు రామచంద్రయ్య పిలుపు

రాజకీయ శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న రామచంద్రయ్య

విశాలాంధ్ర-లేపాక్షి: సమస్యలపై నిరంతర పోరాటాల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేయడం, తద్వారా కమ్యూనిస్టులు చట్టసభల్లో అడుగుపెట్టడమే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు, కూలీ, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా బడాబాబులకు కట్టబెడుతున్నాయని ఆగ్రహం వెలిబుచ్చారు. పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై కమ్యూనిస్టులు నిరంతరం పోరు సాగిస్తున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో పోరాటాలు ఉధృతం చేయాలని కోరారు. సీపీఐ జిల్లా రాజకీయ శిక్షణా తరగతులు శనివారం ఉదయం లేపాక్షిలోని ఆర్‌జేహెచ్ ఫంక్షన్ హాలులో ప్రారంభమయ్యాయి. 30 మండలాల నుంచి మహిళా కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. సీపీఐ సీనియర్ నాయకుడు లేపాక్షి నారాయణ రెడ్డితో పాటు మండల కార్యదర్శి శివప్ప ఎర్రజెండాను ఆవిష్కరించారు. రామచంద్రయ్య మాట్లాడుతూ దేశ సంపదను బడాబాబులకు పాలకులు కట్టబెడుతున్నారని విమర్శించారు. సామాన్యులను పట్టించుకునే తీరిక పాలకులకు లేదన్నారు. దళితులపై దాడులు, హత్యాచారాలు జరుగుతున్నా ప్రభుత్వాలు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. రాయలసీమలోని అనంతపురం, సత్యసాయి జిల్లాలకు చెందిన చాలా మంది కూలీలు పొట్టచేత పట్టుకొని కేరళ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలు వెళుతున్నారని, అక్కడ వారు బానిసత్వం అనుభవిస్తున్నారని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ మాట్లాడుతూ రాజకీయ అవగాహన, ప్రజాసమస్యలు, పాలకుల దుర్మార్గపు విధానాల గురించి శిక్షణా తరగతుల్లో నేర్చుకోవాలని కార్యకర్తలకు సూచించారు. ముందు...మనం చైతన్యవంతం కావాలని, తర్వాత ప్రజలను చైతన్యవంతం చేయడం కోసం పాటుపడాలని తెలిపారు. జిల్లాలోని 30 మండలాల్లో పార్టీ ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధులుగా ఎందుకు గెలవలేకపోతున్నామని ప్రశ్నించారు. నిత్యం ప్రజాసమస్యలపై పోరాడుతున్న మనం ప్రజలతో ఓటు వేయించుకోలేకపోతున్నామని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తున్నందున రాజకీయ యుద్ధానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాటమయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను భిక్షగాళ్లుగా మారుస్తున్నాయని, పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదని ఆరోపించారు. రైతు సమస్యలపై తమ సంఘం నిరంతరం పోరాటం చేస్తోందని చెప్పారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాయలసీమలో హంద్రీనీవా కాలువ పనులు ఇప్పటికీ పూర్తికాలేదని నిందించారు. ప్రొఫెసర్ కె.రాజశేఖర్ మాట్లాడుతూ సీపీఐ నాయకులు, కార్యకర్తలు రాజకీయ అర్థశాస్త్రం నేర్చుకోవాలని సూచించారు. అప్పుడే రాజకీయ రంగంలో రాణిస్తారని, ప్రభుత్వాలు ప్రవేశపెట్టే బడ్జెట్ల గురించి తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మధు, ఆంజనేయులు, శ్రీరాములు, కదిరప్ప, రాజేంద్ర, బిళ్లకుళ్లాయప్ప, రమణ, జయలక్ష్మి, మహాదేవ్, గంగాధర్, మహిళా సంఘం నాయకులు పద్మావతమ్మ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖరెడ్డి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోవిందరెడ్డి, అంగన్వాడి యూనియన్ నాయకులు సంపూర్ణమ్మ, ఏఐటీయూసీ నాయకులు బాబు, హిందూపురం పట్టణ కార్యదర్శి వినోద్, కృష్ణ, వెంకటేశ్, ఇస్మాయిల్, గౌతంకుమార్, మారుతీరెడ్డి, సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తొలుత ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కళాకారులు విప్లవ గేయాలు ఆలపించారు.

ఏపీ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు

విశాలాంధ్ర-హైదరాబాద్: బీఆర్ఎస్ ఏపీ శాఖ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ సమక్షంలో అనేకమంది నేతలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా తోట చంద్రశేఖర్ మాట్లాడుతూ... వైసీపీ అధికారం చేపట్టిన నాటి నుండి ఏపీ అభివృద్ధికి ఆమడదూరంలో ఉందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు లేక ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ రాజధాని ఏదో చెప్పుకోలేని అయోమయ స్థితిలో రాష్ట్ర ప్రజానీకముందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ప్రజలు బీఆర్ఎస్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. ఏపీలో బీఆర్ఎస్ ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదిగిందని చెప్పారు. శనివారం బీఆర్ఎస్‌లో చేరిన వారిలో పుంగనూరుకి చెందిన రమ్య యాదవ్, పవన్, విజయవాడకి చెందిన కంది ప్రశాంత్, శరత్, కె. మోహన్ బాబు, గోదావరి ఖనికి చెందిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు రఘువీరా ప్రసాద్, చీరాలకి చెందిన స్వప్న గౌడ్ అనంతపురం జిల్లాకి చెందిన సుధాకర్ సహ పలు జిల్లాకి చెందిన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. వారికి తోట చంద్ర శేఖర్ పార్టీ కండువా కప్పి అభినందించారు. తెలంగాణ మోడల్ అభివృద్ధిని ఏపీ ప్రజలు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. రానున్న కాలంలో బీ ఆర్ఎస్ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించనుందని తెలిపారు.

కర్ణాటకలో కాంగ్రెస్ విజయంతో

ఆంధ్రరత్న భవన్‌లో సంబరాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కర్ణాటక అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలలో గెలుపొందడంతో విజయవాడలోని ఆంధ్రరత్నభవన్‌లో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. బాణాసంచా కాల్చి కాంగ్రెస్ శ్రేణులు వివిధ జిల్లాల నుంచి వచ్చిన నాయకులతో హోరెత్తిన నినాదాల మధ్య మిఠాయిలు పంచి పార్టీ శ్రేణులను ఉత్సాహ పరిచారు. అనంతరం ఏపీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు విలేకరులతో మాట్లాడుతూ కర్నాటకలో కాంగ్రెస్ పార్టీ విజయం ప్రజల విజయమని వ్యాఖ్యానించారు. ముఖ్యంగా కర్నాటకలోని తెలుగువారిలో మంచి చైతన్యం వచ్చిందని, ఇది రాబోతున్న సార్వత్రిక ఎన్నికలకు సెమీఫైనల్‌గా అభివర్ణించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో కూడా రాబోయే ఎన్నికల్లో సమైక్యంగా కృషి చేసి పార్టీని అధికారం లోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. దేశంలో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచి తీరుతుందని, రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అవటం ఖాయమని రుద్రరాజు స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు సుంకర పద్మశ్రీ, విజయవాడ నగర అధ్యక్షులు నరహరశెట్టి నరసింహ రావు, లామ్ తాంతియా కుమారి, కొలనుకొండ శివాజీ, వి.గురునాథం, పీవై కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతో వెళితే మునిగిపోతారు

టీడీపీ, జనసేనకు జగదీశ్ హెచ్చరిక

విశాలాంధ్ర-గుంతకల్లు: బీజేపీ మునిగిపోయే పడవని, అలాంటి పార్టీతో జట్టు కట్టడం తలపై నిప్పుల కుంపటి పెట్టుకున్నట్లేనని టీడీపీ, జనసేనకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీశ్ హెచ్చరించారు. బీజేపీని కలుపుకుంటే వెంటిలేటర్‌పై ఉన్న సీఎం జగన్‌కు ఆక్సిజన్ ఇచ్చినట్టేనని జగదీశ్ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీ చేస్తాయని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చెప్పడం రాష్ట్ర ప్రజలకు రుచించే అంశం కాదని జగదీశ్ అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టడానికి ఈ కూటమి దోహదపడుతుందని తెలిపారు. బీజేపీపై రాష్ట్ర ప్రజలకు తీవ్ర వ్యతిరేకత ఉందని, మోదీ సర్కారు విభజన హామీలు అమలు చేయలేదని, ప్రత్యేక హోదా ఇవ్వలేదని, రైల్వే జోన్ ముచ్చటే లేదని, వెనుకబడిన జిల్లాలకు ప్యాకేజీ ఊసెత్తడం లేదని ప్రజలు మండిపడుతున్నారని గుర్తు చేశారు. బీజేపీని కలుపుకుంటే...ఈ వ్యతిరేకత టీడీపీ, జనసేనకు చుట్టుకుంటుందని వివరించారు. లౌకికపార్టీలతో కలిసి పోరాటానికి టీడీపీ, జనసేన ప్రయత్నించాలని సూచించారు. ఫలితంగా మత రాజకీయాలకు అడ్డుకట్ట వేసినట్లు అవుతుందన్నారు. బీజేపీతో కలిస్తే టీడీపీ, జనసేన గ్రాఫ్ పడిపోతుందని సర్వేలు సైతం చెబుతున్నాయన్నారు. శాసనసభ్యలను కొనుగోలు చేయడం ద్వారా రాజ్యాంగాన్ని, చట్టాలను బీజేపీ తుంగలో తొక్కిందన్నారు. బీజేపీ తీరు నచ్చక ఎన్డీఏలో భాగస్వాములుగా ఉన్న కొన్ని పార్టీలు ఇప్పటికే బయటికి వచ్చేశాయని గుర్తుచేశారు. బీజేపీతో పొత్తు ఆలోచనను విరమించుకోవాలని టీడీపీ, జనసేనకు సూచించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు బి.గోవిందు, నియోజికవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, మండల కార్యదర్శి ఈశ్వరయ్య, సహాయ కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు.

కోర్టు తీర్పు వైసీపీ ప్రభుత్వానికి చెంపపెట్టు

విశాలాంధ్ర-ధర్మవరం టౌన్: జీవో నంబరు-1ని కొట్టివేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు అని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకా చలపతి, నియోజకవర్గ కార్యదర్శి మధు, సీపీఐ పట్టణ కార్యదర్శి రవికుమార్, సహాయ కార్యదర్శి రమణ, తాలూకా చేనేత కార్మిక సంఘం కార్యదర్శి వెంకట నారాయణ, అధ్యక్షులు వెంకటస్వామి అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ జీవో నంబర్-1 ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించేలా ఉందని ఉన్నత న్యాయస్థానం అభిప్రాయపడుతూ జీవోను కొట్టివేస్తూ ఇచ్చిన తీర్పును తాము పూర్తిగా ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందని, తాము చేసే ప్రతి పోరాటం వెనుక ప్రజల కష్ట సమస్యలు ఉన్నాయని వారు గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బెదిరిస్తే బెదిరేది లేదని, ఎన్ని కేసులుకైనా తాము సిద్ధమని, చివరకు జైలుకు అయినా వెళతామని తెలిపారు.

మోదీ హయాంలో ప్రజాస్వామ్యం ఖూనీ

డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని దళితహక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ విమర్శించారు. అనకాపల్లి జిల్లా దళిత హక్కుల పోరాట సమితి సమావేశం వడల శివ ప్రకాశ్ అధ్యక్షతన కోడిగంటి గోవిందరావు భవన్(సీపీఐ కార్యాలయం)లో శనివారం జరిగింది. జేవీ ప్రభాకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ హాజరయ్యారు. ప్రభాకర్ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ దర్శకత్వంలో మోదీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని, ఆర్ఎస్ఎస్‌కు గానీ, బీజేపీకిగానీ రాజ్యాంగంపై ఏమాత్రం విశ్వాసం లేదని ఆరోపించారు. మోదీ అధికారం చేపట్టిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ గుజరాత్ బాబులకు కారుచౌకగా కట్టబెడుతున్నారని చెప్పారు. రిజర్వేషన్లను దెబ్బతీసేందుకు మోదీ సర్కారు ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. దళితులపైనా, మైనారిటీలపైనా విచ్చలవిడిగా దాడులు జరుగుతున్నప్పటికీ మోదీ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం సంక్షేమాన్ని పూర్తిగా వదిలేసిందన్నారు. కుల, మత విద్వేషాలు రెచ్చగొట్టి ప్రజల మధ్య చీలికకు నిత్యం కుట్ర చేస్తోందని విమర్శించారు. బీజేపీని ఓడించడం ద్వారా రాజ్యాంగాన్ని, జాతీయ సమగ్రతను, లౌకిక స్ఫూర్తిని రక్షించుకుందామని పిలుపునిచ్చారు. బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిగాయన్నారు. అయినా జగన్ ప్రభుత్వం దున్నపోతు మీద వర్షం కురిసినట్లు వ్యవహరిస్తున్నదని విమర్శించారు. దళితులపై దాడులకు వ్యతిరేకంగా డీహెచ్‌పీఎస్ పోరాటాలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. సంఘటిత పోరాటాలకు దళితులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీలను జగన్ ప్రభుత్వం నట్టేట ముంచిందని మండిపడ్డారు. రాష్ట్రంలో దళితులపై దాడులు కొనసాగుతున్నా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం పట్టించుకోవడం లేదన్నారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ రాజ్యాంగబద్ధ పాలన కరువైందన్నారు. ప్రభుత్వాలకు రాజ్యాంగం అమలుపై చిత్తశుద్ధి కొరవడిందన్నారు. గ్రామ, మండలస్థాయిలో డీహెచ్‌పీఎస్ కమిటీల నిర్మాణం జరగాలని సూచించారు. డీహెచ్‌పీఎస్ అనకాపల్లి జిల్లా కార్యదర్శి పెద్దాడ లోవరాజు, విశాఖపట్నం జిల్లా కార్యదర్శి గుడాల రాంబాబు, ఉపాధ్యక్షుడు మండే సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు కొంద్రు అప్పారావు, బందుల సుబ్బలక్ష్మి, నాగరత్నం, రాము, అప్పారావు, పెద్దాడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

మోదీకి గుణపాఠం నేర్పిన కర్నాటక

కర్నాటక ఎన్నికల పోరులో తాబేలు గెలిచింది, కుందేలు ఓడింది. మధ్యలో రెండేళ్ల మినహా 2008 నుంచి దక్షిణాదిలో బీజేపీకి ఉన్న ఒకే ఒక్క సౌధం కూలిపోయింది. మోదీ ఉంటే ఏదైనాసాధ్యమే అన్న మంత్రజపంకూడా ఎందుకూ కొరగాకుండా పోయింది. సాధారణంగా ఎన్నికలు ముగిసిన వెంటనే నిర్వహించే జనాభిప్రాయ సేకరణలు గాడి తప్పుతుంటాయి. కానీ ఈ సారి ఆ జోస్యాలన్నీ నిజమైనాయి. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి కావలసిన 113 స్థానాలకన్నా కాంగ్రెస్ దాదాపు పాతిక సీట్లు ఎక్కువే సాధించింది. జనతా దళ్ (ఎస్) కు పట్టున్న పరిమిత ప్రాంతంలో తప్ప ఎక్కువ చోట్ల ముఖాముఖి పోటీయే జరిగింది. అందుకే మోదీ నాయకత్వంలోని బీజేపీని ఓడించడం అసాధ్యం అని పాతుకుపోయి ఉన్న అభిప్రాయం కాస్తా మారిపోవలసి వచ్చింది. కాంగ్రెస్‌కు 136 సీట్లు వచ్చాయి. అంటే 2018 కన్న 57 స్థానాలు ఎక్కువ సంపాదించినట్టే. బీజేపీ 65 చోట్ల గెలిచింది. ఆ పార్టీకి మునుపటితో పోలిస్తే 39 స్థానాల్లో అపజయం ఎదురైంది. జె.డి.(ఎస్) పరిస్థితి మాత్రం గణనీయంగా తారు మారైంది. ఇది వరకు 37 సీట్లు ఉంటే ఇప్పుడు 18 స్థానాలు కోల్పోయి 19 సీట్లకు పరిమితం అయింది. ఓట్ల శాతం ప్రకారం చూస్తే కాంగ్రెస్ 2018లో 38. 14 శాతం ఓట్లు సంపాదిస్తే ఇప్పుడు అయిదు శాతం ఓట్లు పెరిగి 43 శాతం ఓట్లు సాధించగలిగింది. 2018లో గెలిచిన బీజేపీ సాధించిన 36.35 శాతం ఓట్ల కన్నా కాంగ్రెస్ ఎక్కువ శాతం ఓట్లు సంపాదించినా ఫలితం దక్కలేదు. ఈ సారి కాంగ్రెస్ 43 శాతం ఓట్లు సాధించింది. మనం అనుసరిస్తున్న ఎన్నికల వ్యవస్థ ప్రకారం ఏ పార్టీకి ఎంత శాతం ఓట్లు వచ్చాయి అన్నది ప్రధానం కాదు. ఓట్ల శాతాన్నిబట్టి సీట్లు ఉండకపోవచ్చు. బీజేపీ పరాజయం పాలైనా ఓట్ల శాతం తగ్గకపోవడం ఆ పార్టీకి ఊరటే. మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత ప్రజల సమస్యలు ఎన్నికల సమయంలో చర్చకు రాకుండా పోయాయి. కానీ కర్నాటక శాసనసభ ఎన్నికలలో మాత్రం బసవరాజ్ బొమ్మై నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా కొనసాగిందంటున్న అవినీతినే ప్రజలు నిరాకరించినట్టు కనిపిస్తోంది. 2008లో బీజేపీ మొట్టమొదటి సారి అధికారంలోకి వచ్చింది. కానీ బీజేపీది ఎప్పుడూ సుదీర్ఘ పోరాటమే. 1983 లో మొదటి సారి 110 స్థానాలకు పోటీ చేసిన బీజేపీ 18 సీట్లు, 7.9 శాతం ఓట్లు సాధించింది. 71 చోట్ల బీజేపీ అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయారు. 1985 ఎన్నికలలో బీజేపీకి చేదు అనుభవమే మిగిలింది. 115 స్థానాల్లో పోటీ చేస్తే రెండు సీట్లే దక్కాయి. ఓట్ల శాతం కూడా 3.7 శాతానికి పడిపోయింది. 1989లో 119 స్థానాల్లో పోటీ చేసి నాలుగు సీట్లు, 4.13 శాతం ఓట్లు సంపాదించింది. 2014లో మాత్రం బీజేపీ 18 లోకసభ స్థానాలు దక్కించుకుంది. మళ్లీ 2013 శాసనసభ ఎన్నికలలో 40 సీట్లకు పరిమితం కావలసి వచ్చింది. ఈ లెక్కలన్నీ చూస్తే బీజేపీ అంత సులువుగా పోరాడకుండా ఉండదు. ఈ సారి బీజేపీ ఓటమికి అనేక కారణాలు చూపవచ్చు. కానీ బీజేపీ నిరంతర పోరాట పటిమను తక్కువ అంచనా వేయడానికి వీలు లేదు.

మత ప్రాతిపదికన ఎన్నికల్లో విజయం సాధించాలన్న బీజేపీ ప్రయత్నం ఈ సారి బెడిసి కొట్టింది. బజరంగ్ దళ్ ను బజరంగ్ బలీగా మార్చడానికి మోదీ ఎన్ని తంటాలు పడ్డా ఓటర్లు మెచ్చలేదు.

ధరల పెరుగుదల, నిరుద్యోగం, బీజేపీ ఏలుబడిలో పెరిగిన అవినీతి లాంటి ప్రజా సమస్యల మీద కాంగ్రెస్ దృష్టి కేంద్రీకరించినందువల్ల మోదీ మతత్వ ఎత్తుగడలు కూడా వీగిపోయాయి. జె.డి.(ఎస్) ఇప్పటికన్నా బలంగా ఉండడం, అనేక చోట్ల కాంగ్రెస్ తిరుగుబాటు అభ్యర్థుల బెడద ఎదుర్కోవలసి రావడం గత ఎన్నికలలో బీజేపీకి కలిసొచ్చింది. ఈ సారి ఉత్తర కర్నాటకలో, మధ్య కర్నాటకలో చాలా వరకు కాంగ్రెస్, బీజేపీ ముఖాముఖి తలపడడంవల్ల దానికి బొమ్మై ప్రభుత్వం మీద ఉన్న అసంతృప్తి తోడు కావడంతో కాంగ్రెస్ కు విజయావకాశాలు పెరిగాయి. కల్యాణ్ కర్నాటకలో కాంగ్రెస్ కు ఉన్న పట్టు నిలబెట్టుకోవడమే కాక బీజేపీకి బలమైన ప్రాంతాలు అనుకునే కిట్టూరు కర్నాటక, మధ్య కర్నాటకలోనూ కాంగ్రెస్ బీజేపీ కుద్యాలను ఛేదించగలిగింది. అలాగే పాత మైసూరు జె.డి.(ఎస్) కు కంచు కోట అన్న అభిప్రాయమూ తారు మారై కాంగ్రెస్ కు లాభం చేకూర్చింది. కుల సమీకరణల మీద ఆధారపడే బీజేపీ పాచికా పారలేదు. లింగాయత్ ల ప్రభావం గురించి మాట్లాడిన మాటలు పూర్తిగా నెరవేరలేదు. ఒక్కలిగ సామాజిక వర్గం వారు ఈ సారి కాంగ్రెస్ కు దన్నుగా నిలిచినట్టున్నారు. ఉత్తర కర్నాటకలో జె.డి.(ఎస్) ప్రాభవం తగ్గడమూ కాంగ్రెస్ కు ఉపకరించింది. బీజేపీలో బలమైన నాయకులనుకున్న అనేక మంది ఓటమి పాలయ్యారు. ఎన్నికలకు ముందు పార్టీలు మారే వారికి కొదవ ఉండదు. హుబ్లి-ధార్వాడ్ సెంట్రల్ నుంచి పోటీ చేసిన జగదీశ్ షెట్టర్ బీజేపీని వదిలి కాంగ్రెస్ లో చేరినా ఓటమి తప్పలేదు. అంతకు ముందు ఆయన వరసగా ఈ నియోజక వర్గం నుంచి ఆరు సార్లు గెలిచారు. బీజేపీ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా ఉన్న లక్ష్మణ్ సావది ఇటీవలే కాంగ్రెస్‌లో చేరి అథానీ నుంచి పోటీచేసి గెలిచారు. దీన్నిబట్టి గెలుస్తుందనుకున్న పార్టీలో చేరే తత్వం ఎప్పుడైనా పని చేస్తుందన్న భ్రమ వీడింది. వెరసి కర్నాటక ఓటర్లు సర్వాంతర్యామిలా వ్యవ హరించిన మోదీకి గుణపాఠంనేర్పారు. డబుల్ ఇంజిన్ సర్కార్ అన్న మోదీ మంత్రజపం ఘోరంగా విఫల మైంది. మోదీ, అమిత్‌షాద్వయం కర్నాటకలో స్థానిక నాయకత్వాన్ని పూర్తిగా పక్కన పెట్టడం ప్రతికూల ఫలితాలు ఇచ్చింది. కాంగ్రెస్ మాత్రం సిద్ధ రామయ్య, డి.కె.శివకుమార్ లాంటి వారికి పూర్తి స్వేచ్ఛనిచ్చింది. సోనియా, రాహుల్, ప్రియాంక కూడా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్పటికీ స్థానిక నాయకులను నిగమ శర్మ అక్క స్థానానికి దిగజార్చకుండా కాంగ్రెస్ జాగ్రత్త పడింది. ఏడాది కాలంలో హిమాచల్ ప్రదేశ్, కర్నాటకలో బీజేపీని గద్దెదించిన కాంగ్రెస్‌లో నూతనోత్సాహం భవిష్యత్తులో నిరాసక్తంగా ఉండకుండా జాగ్రత్త పడవలసిన ఆవశ్యకతను నొక్కి చెప్తోంది. ఈ రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పుంజుకోవడం కాంగ్రెస్ ముక్త్ భారత్ అన్న మోదీ సంకల్పం మీద నీళ్లు చల్లింది. విజయం సాధిస్తే తన ఘనతేనని ప్రచారం చేసుకునే రాట్నం చుట్టూ తిరిగే ఈగలాంటి మనస్తత్వం గల మోదీకి తగ్గవలసిన దెబ్బే తగిలింది. మొత్తం మీద దక్షిణాదిలో బీజేపీ చేతిలో ఉన్న ఒక్క రాష్ట్రమూ కోల్పోయింది. ఈ అపజయానికి మోదీ బాధ్యత వహిస్తారా అన్నదే అసలు ప్రశ్న.

సెబి జాప్యపు ఎత్తుగడలు

కె.రవీంద్రన్

స్టాక్‌మార్కెట్‌లో షేర్లను తిమ్మినిబమ్మిని చేసి కుంభకోణానికి పాల్పడిన అదానీ గ్రూపు కంపెనీలపై వచ్చిన ఆరోపణలను దర్యాప్తు చేసేందుకు సెబి జాప్యపు ఎత్తుగడలు వేస్తున్నారని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అదానీ గ్రూపు కంపెనీల మోసాలను హిండెన్‌బర్గ్ సంస్థ బైటపెట్టింది. దీనిపై దర్యాప్తు చేయవలసిందిగా షేర్‌మార్కెట్‌ను క్రమబద్ధంచేసే సెబీని ఈ ఏడాది మార్చిలో సుప్రీంకోర్టు ఆదేశించింది. పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలలో షేర్లకు సంబంధించి అదానీ గ్రూపు కంపెనీలు నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినందున దర్యాప్తుకు సుప్రీంకోర్టు ఆదేశించింది. అదానీ గ్రూపు కంపెనీల వ్యాపార లావాదేవీలకు సంబంధించిన సమాచారాన్ని బైటపెట్టడంతో కంపెనీలు విఫలమయ్యాయి. స్టాక్‌మార్కెట్ షేర్లను అసలు ధరకంటే ఎక్కువగా చూపి ప్రజలకు అమ్మి అపారలాభాలు పొందినట్లు హిండెన్‌బర్గ్ నివేదిక తెలియజేసింది. బహుశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సన్నిహిత స్నేహితుడు అయినందువల్లే అదానీపై సెబి దర్యాప్తు చేయకుండా జాప్యం చేస్తోందని భావిస్తున్నారు. దర్యాప్తు పూర్తిచేయడానికి మే 2వ తేదీ సుప్రీంకోర్టు గడువు విధించింది.

షేర్ మార్కెట్‌ను క్రమబద్ధం చేస్తున్న సెబి అన్ని కంపెనీల వ్యవహారాలను ఎల్లవేళలా పరిశీలిస్తూనే ఉంటుంది. అలాంటిది నెలలు గడచినాకూడా దర్యాప్తును పూర్తిచేయకపోవడంలో ఔచిత్యం ఏమీలేదు.

దర్యాప్తు పూర్తి చేయడానికి మరో 6నెలలు గడువు కావాలని సెబి ఏప్రిల్ 29న సుప్రీంకోర్టుకు దరఖాస్తు చేసింది. అమెరికా నుండి పనిచేసే హిండెన్‌బర్గ్ నివేదికను నమ్మడానికి తాము సిద్ధంగాలేమని బీజేపీ నాయకులు ప్రకటనలు చేసిన విషయం తెలిసిందే. దర్యాప్తు పూర్తిచేసి నివేదికను సుప్రీంకోర్టుకు అందచేస్తే అసలు విషయం బైటపడుతుంది. అదానీని నిందితుడిగా నివేదిక తెలియజేసినట్లయితే మోదీ ప్రభుత్వానికి తీవ్రమైన ఇబ్బంది ఎదురవుతుంది. అదానీ కుంభకోణానికి పాల్పడినట్లు నిరూపణ జరిగితే, మోదీ ప్రతిష్ఠ తప్పనిసరిగా దెబ్బతింటుంది. మరో 6నెలలు గడువు కావాలని కోరిన సెబి విజ్ఞప్తిని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్, న్యాయమూర్తులు పిఎస్ నరసింహ, జెపి పర్దివాలాలతో కూడిన ధర్మాసనం మరోమూడు నెలలు గడువు ఇచ్చింది. ఈ వ్యవహారంపై దర్యాప్తుకోసం సుప్రీంకోర్టు ప్రకటించిన నిపుణుల కమిటీ ఇప్పటికే తన నివేదికను అందించింది. పదవీ విరమణచేసిన జడ్జి మనోహర్ సప్రె అధ్యక్షతన ప్రముఖ బ్యాంకర్లు కెవి కామత్, ఓపి భట్, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు నందన్ నీలేకని, పదవీ విరమణ చేసిన న్యాయమూర్తి జెపి దేవధర్, న్యాయవాది సోమశేఖర్ సుందరేశన్‌లతో కూడిన నిపుణుల కమిటీ దర్యాప్తు చేసింది. ఈ నివేదిక సారాంశం కూడా క్లుప్తంగానే ఉంది.

నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి లావాదేవీలను నివేదించడానికి సెబి అదనపు గడువు కోరడం కేవలం కాలయాపన కోసమే. హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలపై ప్రాథమిక అవగాహన ఏర్పడిందని మాత్రమే సెబి తెలియజేసింది. స్టాక్‌మార్కెట్లలో షేర్ల ధరను అమాంతంగా పెంచడం ద్వారా ప్రజల దగ్గర అపారంగా లాభాలను పొందిందని హిండెన్‌బర్గ్ సమాచారం. అలాగే షేర్లకు సంబంధించిన కనీస నియమ నిబంధనలను కూడా కార్పొరేట్ కంపెనీలు పాటించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. హిండెన్‌బర్గ్ నివేదిక బైటపెట్టకముందు, ఆ తర్వాత కూడా అదానీ గ్రూపు షేర్ల విక్రయం జరిగింది. విదేశీ పోర్టుఫోలియో పెట్టుబడులు(ఎఫ్‌పీఐ) విదేశీ కంపెనీలు నేరుగా పెట్టుబడి పెట్టడంలోనూ(ఓడిఐ) నియమ నిబంధనల ఉల్లంఘన జరిగిందన్న ఆరోపణలు ఉన్నాయి. పిటిషనర్ల తరఫున న్యాయవాది ప్రశాంత్‌భూషణ్ వాదిస్తూ సెబికి అదనపు గడువు ఇవ్వడం సరైందికాదని అన్నారు. అంతర్జాతీయ సెక్యూరిటీల కమిషన్ల సంస్థలో సభ్యులైన దేశాలనుంచి సమాచారం సెబి తీసుకొని నివేదికను ఇవ్వవచ్చునని అన్నారు. అదానికంపెనీలు అనేక నకిలీ కంపెనీలను సృష్టించి వాటి ద్వారా భారతదేశం నుంచి నిధులను మళ్లించినట్లుకూడా ఆరోపణలు వచ్చాయి.

బైటపడిన బీజేపీ అసలు స్వరూపం

వినయ్ విశ్వం

మణిపూర్ బీజేపీకి ట్రంప్ కార్డ్ లాంటిది. 2017లో బీజేపీ తొలిసారిగా అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఈశాన్య ప్రాంతమైన మణిపూర్‌లో తిష్టవేసేందుకు బీజేపీ పక్కా ప్రణాళికతో వ్యవహరించింది. 60 మంది సభ్యుల మణిపూర్ అసెంబ్లీలో కేవలం బీజేపీకి 21 మంది ఎమ్మెల్యేలు, కాంగ్రెస్‌కు 28 మంది సభ్యులు ఉన్నారు. ఎమ్మెల్యేల కొనుగోళ్లు, గవర్నర్ కార్యాలయం తారుమారు వ్యవహారాలు మణిపూర్‌లో బీజేపీ పట్టుకు దోహదపడ్డాయి. అక్కడి నుంచి ఈశాన్య రాష్ట్రాల్లో విద్వేష రాజకీయాలను ఒకదాని తర్వాత ఒకటిగా సమీప రాష్ట్రాలకు విస్తరించింది. మతపరమైన మైనారిటీవర్గాలు, గిరిజనులు బీజేపీకి సానుకూలంగా తమ అబద్ధాల ఫ్యాక్టరీలో కొత్త పథకం రూపొందించింది. దేశం నాలుగు దిక్కులా ఈ వ్యవహారాన్ని ప్రచారం చేసింది. ప్రస్తుతం తాను సృష్టించిన ఈ కథే ముక్కచెక్కలైంది. మైనారిటీలు, గిరిజనులు, సమాజంలోని ఇతర వర్గాలలో బీజేపీ అసలు స్వరూపం బైటపడింది. ఇది తాజాగా రాష్ట్రాన్ని కల్లోలంలోకి నెట్టింది. ఈశాన్య ప్రాంత ప్రజలకు అత్యంత సవాలుగా, కల్లోలంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో దక్షిణాది రాష్ట్రమైన కర్నాటకలో ఓట్ల కోసం ప్రధాని తంటాలుపడటం చూశాం.

మొత్తం మణిపూర్‌లో హింసాకాండ చెలరేగడానికి హైకోర్టు ఉత్తర్వు కారణమైంది. మెయిటీలను ఎస్‌టీ జాబితాలో చేర్చేందుకుగాను కేంద్ర హోం శాఖకు సిఫారసు చేయాలని రాష్ట్ర హైకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని సూచించడంతో దీనిని రాష్ట్రంలోని గిరిజనులు నిరసించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో హింసాత్మక ఘర్షణలు, నిరసనలు, ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. హైకోర్టు ఉత్తర్వు రాష్ట్రంలో హింసకు ప్రేరేపణ కావచ్చు కానీ.. ప్రజలను విభజించి ఉద్రిక్తతలకు కారణమైన బీజేపీ విధానాలు రాష్ట్రంలో తీవ్ర గందరగోళానికి కారణమని స్పష్టమైంది. బీజేపీ అధికారాన్ని చేజిక్కించుకునే కుటిల నిరంకుశ ధోరణి రాష్ట్రాన్ని మరింత అగాధంలోకి నెట్టివేసింది. ఈ ఘర్షణలో 60 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ప్రజల్లో

విభేదాలు సృష్టించడం ద్వారా బీజేపీకి ఎన్నికలలో లాభించినప్పటికీ, సమాజంలో నెలకొన్న వినాశకరమైన పరిణామాలకు బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్‌లు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంది. అధికారాన్ని చేజిక్కించుకోవాలనే బీజేపీ లక్ష్యం ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌నే కాదు, మొత్తం ఈశాన్య భారతాన్ని ఛిద్రం చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న అశాంతితో మణిపూర్ ప్రజలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో బీజేపీ నాయకత్వం మొత్తం కర్నాటక ఎన్నికల రాజకీయాల్లో మునిగిపోయింది. ప్రజలను మత విద్వేషాలతో విభజించడం సమాజంలోని అన్ని వర్గాల వారి మధ్య బీజేపీ నాటుతున్న ద్వేషం, విభజన బీజాలు దేశాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయనేది స్పష్టం.

మణిపూర్‌లో సాధారణ స్థితిని పునరుద్ధరించడం, శాశ్వత శాంతిని నెలకొల్పడం కేంద్ర ప్రభుత్వం తక్షణ కర్తవ్యం. అయితే, తాజా సమస్యలపై బీజేపీకి సంకుచితత్వ ధోరణి ఫలితంగా ఇది కేవలం శాంతిభద్రతల సమస్యగా పరిగణించడమైంది. సాయుధ బలగాలు భారీగా మోహరించడం ద్వారా రాష్ట్రంలో నెలకొన్న అశాంతికి, హింసకు మూలమైన అంశాలను పరిష్కరించదు. తద్వారా ప్రజల్లో ప్రభుత్వం కలిగించిన తీవ్ర నిరాశా, నిస్పృహలు మణిపూర్‌లో హింసకు దారితీస్తున్నాయి. వీటిని రాజకీయంగా, సామాజికంగా పరిష్కరించుకోవల్సి ఉంది. ప్రభుత్వంలో భాగస్వాములు, ప్రాతినిధ్య సంస్థలు, రాజకీయ పార్టీలను సంప్రదించి తగిన నిర్ణయాన్ని విశ్వాసంలోకి తీసుకోవాలని సిపిఐ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

మెయిటీలకు ఎస్టీ హోదాను సిఫారసు చేస్తూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై చర్చించడానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా అంగీకరించినప్పటికీ, ఆ ఉత్తర్వుకు సంబంధించిన పరిధి పరిమితమైంది. సంప్రదింపులు ద్వారా దీర్ఘకాలిక సామాజిక సమస్యలను పరిష్కరించుకోవలసిఉంది. మణిపూర్‌లో ఈ విద్వేషం ఎలా, ఎందుకు పుట్టిందో దర్యాప్తు చేసి, దీనికి కారణమైన శక్తులను బయటపెట్టాలి. నిర్వాసితులైన వారికి తక్షణ పునరావాస సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఈ దారుణ హింసాకాండలో ప్రాణాలు కోల్పోయిన, గాయపడిన వారికి తగిన పరిహారం కల్పించాలి.

బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్‌లు తమ మతతత్వ సైద్ధాంతిక ధోరణితో దేశాన్ని పాలించడానికి అనర్హులని దేశ ప్రజలకు గోచరిస్తోంది. బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్‌లు ఎన్నికల్లో తమ స్వప్రయోజనాల కోసం సమాజంలో చీలికలను సృష్టించడంద్వారా విద్వేషాలను రగిలిస్తున్నాయి. భారతదేశం వంటి వైవిధ్యభరితమైన దేశంలో ముఖ్యంగా కశ్మీర్, క్లిష్టమైన ఈశాన్య ప్రాంతాల్లో చర్చలు లేకుండా పరిపాలన అనుకూలించదు. బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ సైద్ధాంతికంగా, సంకుచిత మతతత్వధోరణితో ఏకఛత్రాధిపత్యానికి అనుకూలంగా ఉన్నాయి. ఈ మతతత్వ సైద్ధాంతికత దేశంలో శాంతి, సామరస్యానికి విఘాతం కలిగిస్తాయి. దేశంలో నెలకొన్న బీజేపీ పాలనలో ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

కశ్మీర్‌లో బీజేపీ అమలుచేసిన విధానం ఘోరంగా విఫలమైన తర్వాత, ప్రస్తుతం ఈశాన్య రాష్ట్రాల్లో నెలకొన్న తాజా పరిస్థితిని మనం చూస్తున్నాం. ప్రస్తుతం నెలకొన్న గందరగోళ పరిస్థితి మరింత జటిలం కాకుండా శాంతి, సామరస్యానికి ప్రాధాన్యత కల్పించడం ద్వారా ఐక్య కార్యాచరణ యత్నాల ద్వారా ప్రజల మధ్య సంబంధాలను బలోపేతం చేయాల్సింది ప్రభుత్వాలే. మన రాజ్యాంగంలో నెలకొన్న లౌకికతత్వం, మన స్వాతంత్ర్య ఉద్యమ సమగ్ర వారసత్వంతో ప్రజలను ఐక్యం చేయడంద్వారా చైతన్యవంతులను చేయ వలసిన అవసరం ఉంది. మన దేశ ప్రజల మధ్య విద్వేషాలను సృష్టించడంపై ఆర్‌ఎస్‌ఎస్-బీజేపీపాలన ఆధారపడి ఉంది. ప్రజల మధ్య విద్వేషాల్ని రూపుమాపి ప్రేమ, కరుణ, సానుభూతితో మన దేశాన్ని శాంతి, పురోగతి, శ్రేయస్సుతో ముమ్ముందుకు నడిపించవలసిన అవసరం ఉంది.

హద్దులు లేని హక్కుల పరిరక్షణకు 'అన్‌హద్'

డాక్టర్ దేవరాజు మహారాజు

"దేశభక్తి మన చివరి ఆధ్యాత్మిక మజిలీ కాకూడదు. నేను వజ్రాల ధరనిచ్చి గాజుపూసలు కొనుక్కోను. నా జీవితకాలంలో ఎన్నడూ దేశభక్తి మానవత్వాన్ని అధిగమించనీయను"-విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్

2002లో గుజరాత్‌లో జరిగిన మారణహోమానికి ప్రతిస్పందనగా మార్చి 2003లో అన్‌హద్ పేరుతో ఒక ఎన్‌జీఓ సంస్థ రూపుదిద్దుకుంది. ఆ సంస్థ ఇరవైఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అన్‌హద్ కార్యక్రమాల్ని ఒకసారి నెమరు వేసుకోవాల్సి ఉంది. అలాంటి ఎన్‌జీఓల ఆవసరం నేడు దేశంలో ఎంతగాఉందో ఆలోచించుకోవాల్సి ఉంది. దేశంలో నాశనమవుతున్న మానవహక్కులు, అపహాస్యం అవుతున్న ప్రజాస్వామ్యం, బద్దలవుతున్న సామాజిక న్యాయం, బీటలు వారుతున్న సుహృద్భావం కొంతమంది సామాజిక కార్యకర్తల్ని, మార్క్సిస్టు మేథావుల్ని స్థిమితంగా కూర్చోనీయలేదు. సామాజిక కార్యకర్త షబ్నమ్ హాష్మి, ఆమె సోదరుడు సఫ్దర్ హష్మి, మార్క్సిస్టు చరిత్ర కారుడు ప్రొఫెసర్ ఫణిక్కర్, సామాజిక కార్యకర్త హర్ష్ మందర్ ప్రభృతులంతా కలిసి దిల్లోలో 'అన్‌హద్'ను ప్రారంభించారు. మానవహక్కులు, ప్రజాస్వామ్యం, ప్రజల మధ్య సుహృద్భావం వంటివి పరిరక్షిస్తూ దేశంలో శాంతిభద్రతలు నెలకొల్పాలన్న మహదాశయంతో అన్‌హద్-ఎన్‌జీఓ ప్రారంభమైంది. 'అన్‌హద్' అంటే హద్దులు లేనిది. కుల, మతాల మధ్య, ప్రాంతాల మధ్య ద్వేషాన్ని నింపి, మనిషిని మనిషితో కలవకుండా చేస్తున్నవారి ఆటలు కట్టించడానికి అన్‌హద్ ఏర్పడింది.

"మతతత్వాన్ని మట్టుబెట్టే పని ముస్లింలది. సిక్కులది, క్రైస్తవులది, హిందువులది-అంతేకాదు, భారతీయులందరిదీ! దీనికోసం వారంతా మతతత్వ దృక్పథాన్ని అధిగమించి నిజమైన జాతీయవాద మనస్తత్వాన్ని అలవరచు కోవాలి!!" అని అన్నారు సుభాస్ చంద్రబోస్. మనిషి మనిషిని బతికించు కోవాలని, మనిషి మనిషిని ప్రేమించాలని, మనిషే కేంద్రంగా జరుగుతూ వస్తున్న అన్ని కార్యక్రమాలనూ ప్రోత్సహించాలని అన్‌హద్ సంస్థ నిర్వాహకులు దృఢనిశ్చయంతో ముందుకు నడిచారు. స మాజాన్ని నడిపిస్తున్నారు. ఇక్కడ మనం గమనించాల్సిన, పరిగణనలోకి తీసుకోవాల్సిన విషయం ఒకటుంది. కేవలం నిజాయితీ, నిబద్ధతలమీద నడుస్తున్న ఈ ఎన్‌జీఓకు ఏ ఆర్థికవనరులూ లేవు. చెప్పుకోదగ్గ నెట్‌వర్కూ లేదు. అయినా, ఆదిశక్తికి మించి దేశ పౌరులకు స్ఫూర్తి నందిస్తూ ఉంది. నాటకకర్త సఫ్దర్‌హష్మి అన్‌హద్ కంటే ముందు 'సహెమత్' అనే సంస్థను రూపొందించారు. ఆ అనుభవం ఇక్కడ పనికొచ్చింది. సహెమత్- అంటే అంగీకరించడం-'అన్‌హద్' ఉద్దేశం. ముఖ్యంగా గుజరాత్‌లోను, కశ్మీర్‌లోను, మతతత్వ వాదలు దాడుల్ని ఎదుర్కోవడం, వారిని ధైర్యంగా చట్టానికి అప్పగించడం ఈ సంస్థ సాధించిన విజయాలలో అన్‌హద్ ఆలోచనల్ని, ఆశయాల్ని జనంలోకి విరివిగా తీసుకుపోవడానికి పుస్తకాలు, కరపత్రాలు ప్రచురించడం జరిగింది. "దురాగతాలను బహిర్గతం చేస్తూ, ఉన్నత నైతిక భావాలను వ్యాప్తి చేయడం కంటే మిన్న అయిన లక్ష్యమూ- ప్రయోజనమూ సాహిత్యానికి మరొకటి లేదు"- అని మన తెలుగు మహాకవి గురజాడ అప్పారావు అన్నారు కదా? అన్‌హద్ సభ్యులు గ్రూపులుగా ఏర్పడి, జనంలో తిరుగుతూ ప్రజలకు మానవ హక్కుల గూర్చి, రాజ్యాంగంలోని కీలక అంశాల గూర్చి, మానవీయ విలువల గూర్చి విరివిగా ప్రచారం చేయడం జరిగింది. ఇంకా జరుగుతూనే ఉంది. అన్‌హద్‌లో భాగస్వాములు కావడం ఈ దేశ పౌరులందరి బాధ్యత!

Act Now for Harmony And Democracy

ఇంతవరకు జరిగిన, జరుగుతున్న పరిశోధనలన్నీ మనుషులు చేసినవే. మానవ శ్రేయస్సు కోసం చేసినవే తప్ప, ఏ అతీత శక్తి మహిమా కాదు. స్వార్థ చింతనతో అబద్ధాలు ప్రచారం చేసి, అధికార పీఠం దక్కించుకుని, మారణహోమాలు సృష్టిస్తున్న వారు మన కళ్ల ముందే ఉన్నారు. భ్రమల్లో బతకకుండా వాస్తవాల్ని గ్రహిస్తూ- కుట్రదారుల మోసాల్ని తిప్పి కొట్టాల్సిన తరుణం ఆసన్నమైంది. ప్రజలే ఐకమత్యంతో పరిపాలకుల మీద ఒత్తిడి పెంచాలి. అందరికీ అవకాశాలు, అందరికీ న్యాయం సమంగా అందే విధంగా కృషి చేయాలి. ముఖ్యంగా కుల, మత, ప్రాంతీయ, లింగ భేదాల హద్దుల్ని చెరిపేసి, మనుషులంతా ఒక్కటే- అనే ఆలోచనలోకి రావాల్సి ఉంది. 'అన్‌హద్'-ఎన్‌జిఓను ఒక ట్రస్ట్‌గా రిజిస్టర్ చేశారు. దీని ప్రధాన కార్యాలయం న్యూదిల్లీలోని కన్నింగ్ లేన్‌లో ఉంది. మొదట ఆరుగురు ట్రస్టీ సభ్యులుగా ఉన్నారు. వారు- షబ్నమ్ హాష్మి, అబన్ రాజా, అమృతా నాండి, హర్ష్ మందర్, శుభా మీనన్, ముఖ్తార్ షేక్! ఆ తర్వాత కాలంలో ప్రొఫెసర్ కె.ఎన్.ఫణిక్కర్, ప్రొఫెసర్ రామ్ పున్యాని, శోభా ముద్గల్ (సంగీతకారిణి) కమలాభాసిన్ (స్త్రీవాద రచయిత్రి) సయీద్ అఖ్తర్ మిర్జా (రచయిత- చిత్ర దర్శకుడు) ధృవ్ సంగం (గాయకుడు- సంగీతకారుడు) మొదలైన ప్రముఖులంతా గత పదహారేళ్లుగా ఆ ట్రస్ట్‌లో ఉన్నారు.

2002 గుజరాత్ మారణ హోమానికి బలి అయి, నిరాశ్రయలైన బాలబాలికల్ని అన్‌హద్ సంరక్షించింది. గుజరాత్ అల్లర్లపై వచ్చిన 'పర్జానియా'వంటి చలన చిత్రాలు వారికి చూపించి, వాస్తవాలు అర్థమయ్యేట్టుగా చేసింది. 2010 లో ఈ సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. ఆర్మీ సెక్యూరిటీ బలగాలు కశ్మీర్ లోయలో ఎన్నో దురాగతాలకు పాల్పడ్డాయని ప్రజాస్వామ్యాన్ని, మానవ హక్కుల్ని అపహాస్యం చేసాయనీ అపహాస్యమే కాదు కొన్ని చోట్ల అవి పూర్తిగా తుడిచి పెట్టుకుపోయాయని అందుకు కారణం ఇప్పటి కేంద్ర భ్రుత్వమేననీ అన్‌హద్ నిర్భయంగా చెప్పగలిగింది. అలాగే బాట్లా హౌస్ ఎన్‌కౌంటర్ రేసు గురించి దర్యాప్తు చేయాల్సిందిగా దిల్లీ పోలీసులను అన్‌హద్ డిమాండ్ చేసింది. 2009 లో మహిళా రిజర్వేషన్ బిల్లు మీద ఈ ఎన్‌జిఓ సంస్థ దృష్టి సారించింది. ఆ విషయాన్ని దేశ వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేయడానికి 'రిజర్వేషన్ ఎక్స్‌ప్రెస్' అనే కార్యక్రమం రూపొందించుకుంది. దేశంలో దుష్ట పాలనకు మూల కారణమైన ఆరెస్సెస్‌ను వెంటనే నిషేధించాలని అన్‌హద్ 2012 మార్చి 24న డిమాండ్ చేసింది. దేశంలో ముస్లింల అస్థిత్వాన్ని విశ్లేషించడానికి జాతీయ సమావేశాలు నిర్వహించింది. ఉగ్రవాదం పేరుతో అన్యాయంగా మైనార్టీల మీద జరుగుతున్న అఘాయిత్యాల్ని నిరసిస్తూ 2010 లోను 2012 లోనూ కార్యక్రమాలు చేపట్టింది. ధులే అల్లర్ల మీద నిజ నిర్ధారణ కమిటీ వేసి, మానవ హక్కుల పరిరక్షణకు సామాజిక న్యాయ స్థాపనకు పోరాడింది. అన్‌హద్ చేపట్టిన కార్యక్రమాలలో ఇవి కొన్ని మాత్రమే - దేశంలో ప్రభుత్వ పరంగా ఎక్కడ ఏ అన్యాయం జరిగినా అన్‌హద్ ఎండగడుతూనే వచ్చింది. నిరంతరం తన పోరాటం కొనసాగిస్తూనే ఉంది. స్వర్గమంటే ఎక్కడో లేదు. దాన్ని ఈ ధరాతలం మీద మనమంతా కలిసి నిర్మించుకోవాల్సి ఉందన్న మాటను వాస్తవంలోకి తేవడానికి దేశ పౌరులంతా కంకణబద్ధులవ్వాలి.

"నరేంద్రమోదీ, అమిత్‌షాలతో కలిసి ఈ దేశ ప్రజలనందరినీ నేను ఘోరంగా మోసం చేశాను. బిజెపి చేసిన స్కాంలలో నాది కూడా సమానమైన భాగస్వామ్యం ఉంది. ఈ అపరాధ భావంతో నేను చచ్చిపోదలుచుకోలేదు. అందుకే, నన్ను క్షమించమని భారతీయులందరినీ వేడుకుంటున్నారు." అని చనిపోవడానికి ముందు రామ్ జత్మలానీ (14 సెప్టెంబర్ 1923-8 సెప్టెంబర్ 2019) ప్రకటించాడు. ఆ ప్రకటన పత్రికలు అచ్చేశాయి. ఆయన మాట్లాడిన వీడియో కూడా దేశ ప్రజలకు అందింది. రామ్ జత్మలాని సుప్రీంకోర్టు లాయరు, బార్ కౌన్సిల్ ఛైర్మన్, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అంతే కాదు, రాజకీయవేత్త, కేంద్ర న్యాయ శాఖ మాజీ మంత్రి. దీనివల్ల ఏం తెలుస్తోంది అంటే- నిజాలు దాగవు! అని. డిస్కవరి సైన్స్ వంటి టెలివిజన్ ఛానల్ కార్యక్రమాలు ఒక్క పది నిముషాలు శ్రద్ధగా గమనిస్తే చాలు. మనిషి ఎక్కడి నుండి ఎక్కడికి వెళ్లాడు? ఎంత సాధించాడు? అనేది అర్థమవుతుంది కానీ, మన ప్రభుత్వాలు విచక్షణా జ్ఞానాన్ని కప్పిపెట్టే విధంగా రైతులు ఆవు ఆధారిత వ్యవసాయం చేయాలని ప్రయటిస్తాయి. ఆవు మూత్రం, ఆవు పేడ ప్రదర్శిస్తూ ప్రజల్ని వెనక్కి అనాగరిక సమాజంలోకి నెట్టేస్తాయి. ప్రభుత్వాలు చేస్తున్న అనైతిక దోపిడిని ఎవరూ, ప్రశ్నించగూడదని ప్రభుత్వ పెద్దలు కోరు కుంటున్నారు. కానీ, అది ఎల్లకాలం సాగుతుందా? రైతు చట్టాల్ని ప్రజలు ఎలా తిప్పికొట్టారో గత సంవత్సరం చూశాం కదా? అదే స్ఫూర్తిని తీసుకుని ప్రజలు ఇతర విషయాలలో కూడా వివేకవంతంగా ఎందుకు స్పందించరూ? వారికి కావల్సిందేదో వారు ఎందుకు సాధించుకోరూ? 'అన్‌హద్' లాంటి ఎన్‌జిఓలు ప్రజలకు అండగా ఉంటూనే ఉన్నాయి.

కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త

విశాలాంధ్ర

'బజరంగ్ బలి' గద వారిపై పడింది

సంజయ్ రౌత్



ముంబై : శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ థాకరే) నాయకుడు సంజయ్ రౌత్ శనివారం కర్నాటక ఎన్నికల్లో బీజేపీ ఓటమిని ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా ఓటమిగా అభివర్ణించారు. 'బజరంగ్ బలి గద బీజేపీపై పడింది' అని రౌత్ విలేకరులతో అన్నారు. కాంగ్రెస్ పార్టీ కర్నాటకకు తన ఎన్నికల మ్యానిఫెస్టోలో తీవ్రవాద సంస్థలను కట్టడి చేస్తానని వాగ్దానం చేసింది. అదే పంథాలో నిషేధిత ఇస్లామిస్ట్ సంస్థ పీఎఫ్ఐ, బజరంగ్ దళ్, వీహెచ్‌పీ యువజన విభాగం గురించి ప్రస్తావించింది. కర్నాటకలో జరిగిన ఎన్నికల ర్యాలీలో బజరంగ్ దళ్‌ను నిషేధిస్తానని, 'జై బజరంగ్ బలి' (హనుమాన్ ప్రభూ హనుమాన్) అని నినాదాలు చేసేవారిని అరెస్టు చేస్తామని హామీ ఇచ్చినందుకు కాంగ్రెస్‌పై ప్రధాని నరేంద్ర మోదీ విరుచుకుపడ్డారు. రౌత్ మాట్లాడుతూ 'ఇది మోదీ, షా ఓటమి' అని, కర్నాటకలో ఏమి జరిగిందో అది కచ్చితంగా 2024 లోక్‌సభ జరగబోతోందని తెలిపారు. వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికల ఫలితాలకు కర్ణాటక ఎన్నికల ఫలితాలు నిదర్శనమని రౌత్ అన్నారు.

దేశాన్ని ఐక్యం చేసే రాజకీయ విజయం

ప్రియాంక గాంధీ వాద్రా

న్యూఢిల్లీ : కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పని తీరు దేశాన్ని ఐక్యం చేసే రాజకీయ విజయమని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా శనివారం కొనియాడారు. ప్రియాంక గాంధీ ఎన్నికల కోసం విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. 12 రోడ్ షోలలో పాల్గొనడమే కాకుండా 13 బహిరంగ సభలలో ప్రసంగించారు. ఆమె రెండు మహిళా సమావేశాలు, కార్మికుల సమావేశాన్ని కూడా నిర్వహించింది. కాంగ్రెస్ పార్టీకి చారిత్రాత్మకమైన విజయాన్ని అందించినందుకు కర్నాటక ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు అని ప్రియాంక హిందీలో ట్వీట్ చేశారు. 'ఇది కర్నాటక ప్రగతి ఆలోచనకు ప్రాధాన్యతనిస్తూ సాధించిన విజయం. దేశాన్ని ఏకం చేసే రాజకీయ విజయం. కష్టపడి పని చేసిన కర్నాటక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలందరికీ నా శుభాకాంక్షలు. మీ కష్టమంతా ఫలించింది. కర్నాటక ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు కాంగ్రెస్ పార్టీ పట్టుదలతో పని చేస్తుంది. జై కర్నాటక, జై కాంగ్రెస్' అని ఆమె అన్నారు. కర్నాటకలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వెంటనే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఐదు హామీలను అమలు చేయాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రస్తావించారు.

కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రులు... స్పీకర్ ఓటమి

బెంగళూరు : కర్నాటక అసెంబ్లీ ఎన్నికలలో బసవరాజ్ బొమ్మై నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వంలోని అనేక మంది మంత్రులు, అసెంబ్లీ స్పీకర్ ఓడిపోయారు. శనివారం ఫలితాలు వెలువడ్డాయి. వీరిలో స్పీకర్ విశ్వేశ్వర్ హెగ్డే కాగేరిని పక్కన పెడితే బి.శ్రీరాములు, కె.సుధాకర్, జె.సి.మధుస్వామి, గోవింద్ కార్జోల్, ఎం.టి.బి.నాగరాజ్, కె.సి.నారాయణ గౌడ ఉన్నారు. సిర్సి స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి భీమన్న నాయక్‌పై కాగేరి ఓడిపోయారు. బళ్లారిలో కాంగ్రెస్‌కు చెందిన బి.నాగేంద్ర చేతిలో రవాణా శాఖ మంత్రి శ్రీరాములు దాదాపు 29,300 ఓట్ల తేడాతో ఓడిపోయారు. చిక్కబళ్లాపురలో ఆరోగ్య మంత్రి కె.సుధాకర్... ప్రదీప్ ఈశ్వర్ (కాంగ్రెస్) చేతిలో ఓడిపోగా, న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి జె.సి.మాదుస్వామి చిక్కనాయకనహళ్లిలో జేడీ(ఎస్) కి చెందిన సి.బి.సురేష్ బాబు చేతిలో ఓడిపోయారు.

బీజేపీకి వ్యతిరేకంగా ప్రజాతీర్పు ఇది

కేరళ కాంగ్రెస్, సీపీఎం, ఐయూఎంఎల్

తిరువనంతపురం : కర్నాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పని తీరును శనివారం కేరళలోని అధికార సీపీఎం, ప్రతిపక్ష పార్టీలు స్వాగతించాయి. ఇది బీజేపీ విభజన, మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజల సెంటిమెంట్‌కు నిదర్శనమని పేర్కొన్నాయి. కర్నాటక ఓట్ల ధోరణి దక్షిణ భారతదేశంలో బీజేపీ ప్రభావం క్షీణిస్తున్నట్లు చూపిస్తుందని సీపీఎం, ఐయూఎంఎల్, కాంగ్రెస్ తెలిపాయి. కాంగ్రెస్ సీనియర్ నేత రమేష్ చెన్నితాల మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి భారీ, చారిత్రాత్మక విజయాన్ని ఈ ధోరణిని సూచిస్తున్నాయని, 2024 సార్వత్రిక అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాలు కూడా దానికి ప్రేరణ ఇస్తాయని తెలిపారు. అవినీతిలో కూరుకుపోయిన బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వారి మనోభావాలను సూచిస్తున్నాయని అన్నారు. ఇది కాంగ్రెస్, రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రకు ప్రజల ఆమోదాన్ని కూడా చూపిందని అన్నారు. నరేంద్ర మోదీని ఎదిరించగల నాయకుడు రాహుల్ గాంధీ అని ఆయన తెలిపారు. అందుకు ఇదే నిదర్శనం. కేంద్రంలో లౌకిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అన్ని లౌకిక శక్తులను ఏకం చేసేందుకు ఇదే తొలి అడుగు అని చెన్నితాల అన్నారు. ఐయూఎంఎల్ కేరళ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ సాదిఖలీ షిహాబ్ తంగల్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే పీకే కున్హాలికుట్టి కూడా ఇదే తరహాలో మాట్లాడారు. కర్నాటకలో జరిగిన దానితో దక్షిణ భారతదేశంలో బీజేపీ ఇప్పుడు అధికారంలో లేదని చెన్నితాల, ఐయూఎంఎల్ నాయకులు ఇద్దరు అన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ఎం.వి.గోవిందన్ కూడా కర్నాటకలో ఓట్ల ఫలితాలను స్వాగతించారు. దక్షిణ భారతదేశం బీజేపీ నుంచి విముక్తి పొందిందని అన్నారు. అయితే, 'బీజేపీకి భారీ మెజారిటీ ఉన్న గుజరాత్ దాని ప్రధాన శక్తి కేంద్రాలలో ఒకటి అయినందున కాంగ్రెస్ పునరాగమనాన్ని సూచించలేదు' అని పేర్కొంటూ, ఇది వారికి పునరాగమని చెప్పలేమని అన్నారు. 'భారత్‌ను బీజేపీ నుంచి కాంగ్రెస్ స్వతంత్రంగా విముక్తం చేయదు. వారు కూడా ఆ వాదన చేయరు. మనం ప్రతి రాష్ట్రాన్ని ఒక యూనిట్‌గా పరిగణించాలి. అక్కడ బీజేపీ వ్యతిరేక ఓట్లను ఏకీకృతం చేయాలి. అక్కడ వారిని ఓడించాలి. కర్నాటకలో కూడా అదే పని చేసింది' అని ఆయన తెలిపారు. కర్నాటకలో ప్రజలు బీజేపీ చేస్తున్న మత రాజకీయాలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని అన్నారు. ఇది ప్రజల కేంద్ర వ్యతిరేక, మతతత్వ వ్యతిరేక భావాలకు నిదర్శనమని తెలిపారు. గోవిందన్ వ్యాఖ్యలపై చెన్నితలా స్పందిస్తూ, సీపీఎం ఎప్పుడూ బీజేపీ గెలవాలని కోరుకుంటుందని, కర్నాటకలో వామపక్ష పార్టీకి ఒక సీటు ఉందని, అది కూడా ఓడిపోయిందని అన్నారు.

మోదీ-షా ద్వయం ఓటమి

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు నాంది: సిద్ధరామయ్య

మైసూరు: కర్నాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి ఓ ముందడుగు అని ఆ పార్టీ నాయకుడు సిద్ధరామయ్య శనివారం వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని చెప్పారు. కర్నాటక ఎన్నికల ఫలితాలు ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలకు వ్యతిరేక తీర్పు అని మాజీ సీఎం సిద్ధరామయ్య పేర్కొన్నారు. 'కర్నాటక ఎన్నికలు అత్యంత కీలకమైనవి. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి ఈ ఫలితాలు ఆక్సిజన్ వంటివి' అని ఆయన చెప్పారు. వరుణ నియోజకవర్గం నుంచి సిద్ధరామయ్య విజయం సాధించారు. బీజేపీ మంత్రి వి.సోమన్నపై ఆయన గెలుపొందారు. జాతీయస్థాయిలో బీజేపీ యేతర పార్టీలు ఏకతాటిపైకి వస్తాయని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. విపక్షాలన్నీ ఏకమైతే బీజేపీని ఓడించడం కష్టమేమీ కాదని వ్యాఖ్యానించారు. మోదీ, అమిత్‌షా విస్తృతంగా ప్రచారం చేశారని, విపరీతంగా డబ్బు ఖర్చు పెట్టారని, అయినా ఓటమి తప్పలేదని సిద్ధరామయ్య అన్నారు. ప్రత్యేకించి మోదీ కర్నాటకలో 20 ర్యాలీలు నిర్వహించారని, గతంలో ఏ ప్రధాని ఇంతటి ప్రచారం చేయలేదని గుర్తుచేశారు. లౌకిక వ్యవస్థకు ముప్పుగా పరిణమించిన బీజేపీ మత రాజకీయాలను కన్నడ ప్రజలు తిరస్కరించారని స్పష్టంచేశారు. 'కన్నడ ప్రజలు రాజకీయంగా చాలా తెలివైన వారు. రాష్ట్రాన్ని ఏ పార్టీ కాపాడుతుందో ప్రజలకు బాగా తెలుసు' అని చెప్పారు. రాష్ట్రంలో విద్వేషం, మత రాజకీయాలు రాజ్యమేలాయని, దీనిని కన్నడ ప్రజలు భరించలేకపోయారన్నారు. ధనబలంతో అధికారంలో గెలవడం కోసం బీజేపీ తీవ్రంగా ప్రయత్నించిందని, అందులో విజయం సాధించలేకపోయిందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వ పాలనతో విసిగిపోయిన ప్రజలు మార్పు కోరుకున్నారని, రాష్ట్రంలో ప్రజావ్యతిరేకత తీవ్రంగా ఉందని సిద్ధరామయ్య చెప్పారు.

కేఆర్పీపీ నుంచి గాలి జనార్ధన్ రెడ్డి ఒక్కరే!

బెంగుళూరు: కలాణ రాజ్య ప్రగతి పక్ష పార్టీ (కేఆర్పీ)ని స్థాపించి కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలలో పోటీచేసిన గనుల వ్యాపారి గాలి జనార్ధనరెడ్డికి తీవ్ర నిరాశ ఎదురైంది. ఈ ఎన్నికల్లో ఆ పార్టీ మొత్తం 47 మంది అభ్యర్థులను పోటీలో నిలిపింది. కొప్పాల్ జిల్లా గంగావతి నుంచి పోటీ చేసిన గాలి జనార్థనరెడ్డి ఒక్కరే ఎన్నికలలో ఆ పార్టీ తరపున గెలిచారు. మాజీ మంత్రి అయిన గాలి జనార్ధన్ రెడ్డి గతంలో బీజేపీలో చేశారు. ఓబులాపురం గనుల కుంభకోణంలో ఇరుక్కున్న ఆయనను బీజేపీ పక్కనపెట్టింది. ఆయనపై అనేక అక్రమ మైనింగ్ కేసులు కూడా ఉన్నాయి. కాంగ్రెస్ అభ్యర్థి అన్సారిపై గాలి జనార్థనరెడ్డి విజయం సాధించారు. ఇక్కడ బీజేపీ మూడవ స్థానంతో సరిపెట్టుకుంది. బళ్లారి సిటీ నుంచి పోటీ చేసిన గాలి జనార్ధన్ రెడ్డి భార్య అరుణ లక్ష్మితో సహా ఆ పార్టీ ఇతర అభ్యర్థులందరూ ఓడిపోయారు.

ఓట్లశాతంలో దూసుకెళ్లిన కాంగ్రెస్

బెంగుళూరు: కర్ణాటక అసెంబ్లీకి జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ 43 శాతం ఓట్లను సాధించింది. రెండో స్థానంలో నిలిచిన బీజేపీకి 36 శాతం ఓట్లు మాత్రమే లభించాయి. ఈ రెండు పార్టీల మధ్య ఓట్ల తేడా 9 శాతం ఉంది. పేదలలో బీజేపీ పట్ల ఉన్న వ్యతిరేకతను ఈ శాతం ప్రతిబింబిస్తోంది. సెంట్రల్ కర్నాటకలో బీజేపీకి భారీ దెబ్బ తగిలింది. కీలకమైన ఆ ప్రాంతంలో బీజేపీ పేలవ ప్రదర్శన ఇవ్వడం ఆ పార్టీకి తీవ్ర నష్టాన్ని కలిగించింది. 2018 ఎన్నికలలో కన్నా కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికలలో దాదాపు ఐదు శాతం ఓట్లు అదనంగా వచ్చాయి. లింగాయత్ ఓట్లను గెలుచుకోవడంలో ఈసారి కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. సాధారణంగా బీజేపీకి ఎప్పుడూ అనుకూలంగా ఉండే లింగాయత్ ఓటర్లు ఈసారి కాంగ్రెస్‌కు మొగ్గుచూపినట్లు స్పష్టమవుతోంది. యెడ్యూరప్పను నాయకత్వం నుంచి తప్పించిన నాటి నుంచి బీజేపీలో సమస్యలు మొదలయ్యాయి. బొమ్మైను సీఎంగా చేసినా.. ఆ పార్టీలో మాస్ లీడర్ సమస్య ఏర్పడింది. దీంతో కర్నాటకలో కమల దళానికి ఓటమి తప్పలేదు. బీజేపీ నుంచి యెడ్యూరప్ప తప్పుకోవడం.. కాంగ్రెస్‌లో సిద్ధరామయ్య పుంజుకోవడంతో కర్నాటక లింగాయత్‌లు కాంగ్రెస్ పార్టీ వైపే నడిచారు.

ప్రజావ్యతిరేకతను ఎదుర్కొనేందుకు బీజేపీ వేసిన ఎత్తుగడలు ఫలితాన్నివలేదు. దాదాపు 24 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు బీజేపీ ఈసారి టికెట్ నిరాకరించింది. ఆ ఎత్తుగడలో పార్టీ విఫలమైంది. అనేక మందికి కొత్తగా సీట్లు ఇచ్చినా.. వాళ్లు దాదాపు ఓటమిపాలయ్యారు. అవినీతిపై కాంగ్రెస్ పోరాడినా తీరు కూడా బీజేపీని నిర్వీర్యం చేసింది. బీజేపీ నేతలు ఆ ఆరోపణలను ఎదుర్కొనలేకపోయారు. 40శాతం కమీషన్ వంటి పంచ్‌లకు బీజేపీ కౌంటర్ ఇవ్వలేకపోయింది. కాంగ్రెస్ ప్రకటించిన ఉచితాలను ఎదుర్కోవడంలోనూ బీజేపీ ఆలస్యం చేసింది.

మాన్ ప్రభుత్వం మంచి చేయడం వల్లే

ఆప్ అపూర్వ విజయం

జలంధర్ ఉప ఎన్నికల్లో గెలుపుపై కేజ్రీవాల్

న్యూఢిల్లీ : జలంధర్ లోక్‌సభ ఉపఎన్నికలో ఆప్ అభ్యర్థి భారీ ఆధిక్యంతో ఆధిక్యంలో ఉన్నందున, పంజాబ్‌లో భగవంత్ మాన్ ప్రభుత్వం మంచి పని చేయడం వల్లనే 'అపూర్వ విజయం' లభించిందని పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ శనివారం అన్నారు. ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో తాజా సమాచారం ప్రకారం, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అభ్యర్థి సుశీల్ రింకూ తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి కరమ్‌జిత్ కౌర్ చౌదరిపై 48,000 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. జలంధర్‌లో విజయం పంజాబ్, ఢిల్లీ అధికార పార్టీకి లోక్‌సభలో ఏకైక సభ్యుడిని అందిస్తుంది. గత ఏడాది సంగ్రూర్ ఉప ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటి నుంచి ఆప్‌కి పార్లమెంటు దిగువ సభలో సభ్యుడు లేరు. పంజాబ్ అసెంబ్లీకి ఎన్నికయిన తర్వాత భగవంత్ సింగ్ మాన్ ఎంపీ పదవికి రాజీనామా చేయడంతో సంగ్రూర్ పార్లమెంటు స్థానం ఖాళీ అయింది. ఆప్‌కి ప్రస్తుతం రాజ్యసభలో 10 మంది సభ్యులు ఉన్నారు. జలంధర్ ఉప ఎన్నికపై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఇక్కడ ఆప్ ప్రధాన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 'మాన్ ప్రభుత్వం మంచి పని కారణంగా ఇది అపూర్వమైన విజయం. గత 50 ఏళ్లుగా కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న ఈ స్థానం నుంచి మా పార్టీ అభ్యర్థి గెలుపొందుతున్నారు. కరమ్‌జిత్ కౌర్ భర్త, కాంగ్రెస్ ఎంపీ సంతోక్ సింగ్ చౌదరి జనవరిలో మరణించడంతో జలంధర్ స్థానం ఖాళీ అయింది. 'మేము రాజకీయాలు చేస్తాము. మా పని కోసం ప్రజల నుంచి ఓట్లు కోరుతున్నాము. ప్రజలు 'మీతో ఉన్నాము' అని భగవంత్ మాన్ ప్రభుత్వ పనిపై ముద్ర వేశారు. ఇది ఒక పెద్ద సందేశం' అని కేజ్రీవాల్ తెలిపారు. ఇప్పటివరకు పంజాబ్‌లో తన ప్రభుత్వం చేసిన పనిపై ప్రజల 'సానుకూల ముద్ర' ఉపఎన్నికల ఫలితాల ధోరణి అని అన్నారు. 'ఎన్నికల ఫలితాలు మా బాధ్యతను, నా విశ్వాసాన్ని పెంచాయి. పంజాబ్ అభివృద్ధికి మరింత కృషి చేస్తాం' అని తెలిపారు.

92ఏళ్ల వయసులో అసెంబ్లీకి

బెంగళూరు: కర్నాటక రాష్ట్ర ఎన్నికల చరిత్రలోనే అత్యంత వయోవృద్ధుడైన శివశంకరప్ప అసెంబ్లీ ఎన్నికలలో మరోసారి విజయం సాధించారు. కాంగ్రెస్ నేత అయిన 92ఏళ్ల శివశంకరప్ప దావణగెరె దక్షిణ నియోజకవర్గం నుంచి వరసగా నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈసారి ఎన్నికల్లో పోటీ చేసిన వయోవృద్ధుడిగా ఆయన రికార్డు సృష్టించారు. శామనూరు శివశంకరప్ప 1994లో రాజకీయాల్లోకి అరంగేట్రం చేశారు. అదే సంవత్సరంలో దావణగెరె నియోజకవర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1999లో లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయిన ఆయన 2004లో మరోసారి దావణగెరె నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2008 నుంచి దావణగెరె దక్షిణ నుంచి పోటీ చేస్తున్న శివశంకరప్ప 2013, 2018, 2023లో వరసగా నాలుగోసారి గెలుపొందారు. దావణగెరె నుంచి ఆయన ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ ఎన్నికల్లో శంకరప్పకు ప్రత్యర్థిగా బీజీ అజయ్‌కుమార్‌ను బీజేపీ నిలబెట్టింది. ఈ నియోజకవర్గంలో అధిక సంఖ్యలో ఉన్న ముస్లింలతో అజయ్‌కుమార్‌కు మంచి సంబంధాలు ఉన్నాయి. బీజేపీ విజయం సాధించడం ఖాయమనుకున్నారు. కానీ దావణగెరె నియోజకవర్గ ప్రజలు మరోసారి శివశంకరప్పకే పట్టం కట్టారు.

డీకే శివకుమార్ భావోద్వేగం

బెంగళూరు: కర్ణాటకలో అధికార బీజేపీని మట్టికరిపించి, ప్రభుత్వ ఏర్పాటు దిశగా కాంగ్రెస్ దూసుకుపోతున్నవేళ పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. పార్టీకి ఇంతటి ఘన విజయాన్ని కట్టబెట్టిన ప్రజల పాదాలకు సాష్టాంగ నమస్కారం చేస్తున్నానని చెప్పారు. తమ మీద విశ్వాసం ఉంచి కాంగ్రెస్‌కు గొప్ప విజయాన్ని అందించారని కృతజ్ఞతలు తెలిపారు. కర్ణాటకలో పార్టీని గెలిపిస్తానని సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, మల్లికార్జున ఖర్గేలకు తాను మాట ఇచ్చానని చెప్పారు. బీజేపీ తనను జైల్లో పెట్టించినప్పుడు... తనను చూడ్డానికి సోనియా గాంధీ జైలుకు రావడాన్ని తాను జీవితంలో మర్చిపోలేనని చెపుతూ తీవ్ర భావోద్వేగంతో కంటతడి పెట్టుకున్నారు. కాంగ్రెస్ కార్యాలయం తమకు దేవాలయంతో సమానమని... తర్వాతి స్టెప్ ఏమిటనేది తమ కార్యాలయంలో నిర్ణయిస్తామని చెప్పారు. ఈ విజయం సమష్టి కృషి అని అన్నారు. సిద్ధరామయ్యతో పాటు ప్రతి ఒక్క నేత, ప్రతి ఒక్క కార్యకర్త ఈ విజయంలో భాగస్వాములని చెప్పారు.

హనుమాన్ ఆలయంలో ప్రియాంక పూజలు

సిమ్లా: కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ఇక్కడి జఖూలోని ప్రసిద్ధ హనుమాన్ ఆలయాన్ని శనివారం సందర్శించి పూజలు చేశారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నిర్ణయాత్మక విజయం దిశగా దూసుకుపోతున్న వేళ ఉదయం ఆలయానికి చేరుకున్న ప్రియాంక గాంధీ దాదాపు 15 నిమిషాల పాటు అక్కడే ఉన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రియాంక గాంధీ వ్యక్తిగత పర్యటన నిమిత్తం తన తల్లి, సోనియా గాంధీతో కలిసి శుక్రవారం సిమ్లాకు వచ్చారు. నగరంలోని ఛబ్రా శివారు కళ్యాణి హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి సుఖ్‌విందర్ సింగ్ సుఖు వారికి స్వాగతం పలికారు. సంప్రదాయ సంగీత వాయిద్యాల జ్ఞాపికను ఆయన సోనియా గాంధీకి బహూకరించారు.

సువార్ ఉపఎన్నికలో అప్నాదళ్ విజయం

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్ జిల్లా సువార్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో అధికార బీజేపీ మిత్రపక్షం అప్నా దళ్ (సోనేలాల్) అభ్యర్థి షఫీక్ అహ్మద్... 8,724 ఓట్ల తేడాతో సమీప ఎస్పీ అభ్యర్థి అనురాధ చౌహాన్‌పై విజయం సాధించారు. అన్సారీ ఉపఎన్నికలో పోలైన మొత్తం ఓట్లలో 50 శాతానికి పైగా సాధించారు. ఈయనకు 68,630 ఓట్లు రాగా, ఎస్పీ అభ్యర్థి అనురాధ చౌహాన్‌కు 59,906 ఓట్లు వచ్చాయి. సువార్ అసెంబ్లీ నియోజకవర్గానికి మే 10న ఉప ఎన్నిక జరిగింది. బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ), కాంగ్రెస్ ఈ స్థానానికి అభ్యర్థులను నిలబెట్టలేదు. ఎస్పీ నాయకుడు ఆజం ఖాన్ కుమారుడు అబ్దుల్లా ఆజంఖాన్ ఈ స్థానం నుంచి రెండు పర్యాయాలు శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. కాగా 15 ఏళ్ల నాటి కేసులో మొరాదాబాద్ కోర్టు ఆయనకు రెండేళ్ల జైలు శిక్ష విధించడంతో అనర్హత వేటు పడింది. దీంతో సువార్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయింది. గత ఏడాది జరిగిన ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో అబ్దుల్లా ఆజం ఖాన్ అప్నా దళ్ (సోనేలాల్) అభ్యర్థి హైదర్ అలీ ఖాన్‌పై సువార్‌లో 61,000 ఓట్ల తేడాతో విజయం సాధించారు.

సీఎం ఎవరనేది సోనియా, రాహుల్ నిర్ణయిస్తారు: ఖర్గే

బెంగళూరు: కర్ణాటకలో కాంగ్రెస్ విజయం ఖాయమైన నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎవరనే అంశంపై చర్చ సాగుతోంది. కాగా ముఖ్యమంత్రిగా ఎవరికి బాధ్యతలు అప్పగించాలనే విషయాన్ని కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ నిర్ణయిస్తారని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అద్భుత పనితీరు కనబరిచిందని, బీజేపీ దుష్ట పాలనకు రాష్ట్ర ప్రజలు ముగింపు పలికారన్నారు. కొత్తగా గెలిచిన కాంగ్రెస్ సభ్యులందరూ సాయంత్రంలోగా బెంగళూరుకు రావాలని ఆదేశించామని, ప్రభుత్వ ఏర్పాటుకు తగిన విధానాలను పార్టీ అనుసరిస్తుందని తెలిపారు. ఈ సాయంత్రంలోగా గెలిచిన తమ పార్టీ ఎమ్మెల్యేలు అందరూ రావాలని ఆదేశాలు పంపించినట్లు చెప్పారు. ఈ సాయంత్రంలోగా వారు ఇక్కడికి వస్తారని, వచ్చిన తర్వాత వారికి విధిగా సూచనలిస్తారని, ఆ తర్వాత అధిష్ఠానం పరిశీలకులను పంపుతుందని చెప్పారు. ఆ తర్వాత ప్రభుత్వ ఏర్పాటు కోసం తగిన ప్రక్రియ కొనసాగుతుందన్నారు. కాంగ్రెస్ విజయం జనతా జనార్దన విజయమని, ప్రత్యర్థి బీజేపీ కంటే స్పష్టమైన ఆధిక్యం రావడం ప్రజల ఘనతే అన్నారు. ప్రజలు తమకు పూర్తి మద్దతు ఇచ్చారని, దుర్మార్గపు పరిపాలనకు వ్యతిరేకంగా వారు కసితో మాకు ఓటు వేశారన్నారు. కర్ణాటక ఓటర్లు జాగృతమయ్యారనేందుకు ఇదే నిదర్శనం అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, డజన్ల కొద్దీ మంత్రులు, ముఖ్యమంత్రి ఇతర రాష్ట్రాల మంత్రులు ఇక్కడ క్యాంప్ వేసుకుని, అంగబలం, ధనబలం, కండబలం ఉపయోగించినా ప్రజలు కలిసికట్టుగా కాంగ్రెస్‌కే పట్టం కట్టారన్నారు.

జార్సుగూడలో బీజేడీ ఘనవిజయం

భువనేశ్వర్: ఒడిశాలోని జార్సుగూడ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో అధికార బిజూ జనతాదళ్ (బీజేడీ) అభ్యర్థి దీపాలిదాస్ ఘన విజయం సాధించారు. బీజేడీ అభ్యర్థి దాస్ సమీప ప్రత్యర్థి బీజేపీకి చెందిన టంకాధర్ త్రిపాఠిపై 48,721 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఎన్నికల సంఘం ప్రకటించిన ఫలితాల్లో బీజేడీకి 1,07,198 ఓట్లు రాగా, బీజేపీకి 58,477 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి తరుణ్ పాండే కేవలం 4,496 ఓట్లతో డిపాజిట్ కోల్పోయారు. ఈ స్థానానికి

మే 10న జరిగిన ఉప ఎన్నికలో మొత్తం 2.21 లక్షల మంది ఓటర్లకు గాను 79.21 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఏడాది జనవరి 29న సిట్టింగ్ ఎమ్మెల్యే, అప్పటి ఆరోగ్య మంత్రి నబా కిషోర్ దాస్ హత్యతో ఉప ఎన్నిక అనివార్యమైంది. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో జార్సుగూడలో బీజేడీకి 98,620 ఓట్లు రాగా, బీజేపీ, కాంగ్రెస్‌లకు 52,921, 18,823 ఓట్లు వచ్చాయి. ఈ ఉప పోల్‌లో బీజేడీ, బీజేపీ రెండింటి ఓట్ షేర్ వరుసగా 5 శాతం, 3 శాతం పెరిగింది. అదే సమయంలో కాంగ్రెస్‌కు 8శాతం ఓట్లు తగ్గాయి. తన తండ్రి దివంగత నబాదాస్‌తో పోల్చితే, దీపాలీకి 8,578 ఓట్లు ఎక్కువ వచ్చాయి. మెజారిటీ కూడా 3,022 ఓట్లు పెరిగింది.

ప్రజాతీర్పును గౌరవిస్తాం: యడియూరప్ప

బెంగళూరు: ప్రజాతీర్పును గౌరవిస్తామని బీజేపీ కర్నాటక సీనియర్ నేత బీఎస్ యడియూరప్ప చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు లోక్‌సభ ఎన్నికలపై ఏమాత్రం ప్రభావం చూపబోవని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలోని మొత్తం 28 లోక్‌సభ సీట్లలో 25 గెలుచుకోవడం కోసం కృషి చేస్తామని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు 2019ని పునరావృతం చేస్తాయని ధీమాగా చెప్పారు. '2024 ఎన్నికలకు ఈ ఫలితాలు కొలమానం కాదు. మోదీని ప్రధానిని చేయడానికి గత ఎన్నికల్లో 25 సీట్లు గెలిచాం. వచ్చే ఎన్నికల్లోనూ 25 సీట్ల కోసం చిత్తశుద్ధితో ప్రయత్నిస్తాం' అని మాజీ సీఎం యడియూరప్ప శనివారం ఇక్కడ విలేకరుకు చెప్పారు. ఎన్నికల ఫలితాలతో భయపడవద్దని పార్టీ కార్యకర్తలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఓటమికి గల కారణాలపై పార్టీ ఆత్మపరిశీలన చేసుకుంటుందని ధైర్యం చెప్పారు. ప్రజాతీర్పును ముమ్మాటికీ గౌరవిస్తామన్నారు. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయాల్సి ఉందని వ్యాఖ్యానించారు. 'ప్రతి ఇంటికీ వెళ్లి హామీలు గుప్పించారు. అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే హామీలు నెరవేర్చాలి. ఇది కాంగ్రెస్ పార్టీ కర్తవ్యం' అని యడియూరప్ప సూచించారు. అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే అమలు చేస్తామని కాంగ్రెస్ ఐదు హామీలు ఇచ్చిందని ఆయన తెలిపారు.

ఓటమికి నాదే బాధ్యత: బొమ్మై



షిగావ్: అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటమికి తనదే పూర్తి బాధ్యతని కర్నాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై చెప్పారు. రానున్న రోజుల్లో బాధ్యతాయుత ప్రతిపక్షంగా బీజేపీ పనిచేస్తుందని వ్యాఖ్యానించారు. ఎన్నికల వ్యూహాన్ని కాంగ్రెస్ పార్టీ బాగా అమలు చేసిందని, ఆ పార్టీ గెలుపునకు అది కూడా ఓ కారణం కావచ్చని అభిప్రాయపడ్డారు. 'ఎలాంటి భేషజాలు లేకుండా ప్రజాతీర్పును గౌరవిస్తున్నా. బీజేపీ ఓటమికి బాధ్యత నాదే. రాష్ట్ర ముఖ్యమంత్రిగా నేను బాధ్యత తీసుకుంటున్నాను. ఓటమికి కారణాలను పూర్తిగా విశ్లేషణ చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఇందులో అనేక కారణాలు ఉన్నాయి' అని బొమ్మై చెప్పారు. షిగావ్‌లో బొమ్మై శనివారం మీడియాతో మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో తమ పనితీరును పార్టీ పూర్తిస్థాయిలో విశ్లేషిస్తుందన్నారు. తమ లోపాలను అధిగమించడానికి ప్రయత్నిస్తామని, పార్టీ తిరిగి పుంజుకుంటుందని చెప్పారు. తమది జాతీయ పార్టీ అని, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించడానికి సంస్థాగతంగానూ, పాలనాపరంగా చర్చించుకుంటామన్నారు. తమ లోపాలను సరిదిద్దుకుంటామన్నారు. ఈ ఎన్నికల్లో మోదీ, అమిత్‌షా తంత్రం పనిచేయలేదా అని అడుగగా ఈ ఫలితాలకు అనేక కారణాలు ఉన్నాయన్నారు. విశ్లేషణ చేసుకొని తర్వాత మాట్లాడతామన్నారు. తనను గెలిపించిన షిగావ్ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం పనిచేస్తానన్నారు.

శ్రావణ్ కుమార్‌కు సీపీఐ మద్దతు

విశాలాంధ్ర-విజయవాడ: రాజధాని రైతులకు అండగా పాదయాత్ర తలపెట్టిన జై భీమ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జడ శ్రావణ్‌కుమార్‌ను పోలీసులు అరెస్టు చేసి నున్న పోలీసు స్టేషన్‌కు తరలించారు. జడ శ్రావణ్‌కుమార్‌ను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పరామర్శించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ శాంతియుతంగా నిరసనకు దిగిన శ్రావణ్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోవటం దారుణమన్నారు. శ్రావణ్ కుమార్ ఉద్యమానికి సీపీఐ పూర్తి మద్దతిస్తుందని ప్రకటించారు. గోటితో పోయే దాన్ని గొడ్డలి దాకా తెచ్చిన చందంగా రాష్ట్ర పోలీసుల తీరు ఉందని విమర్శించారు. ఇదే విధానం కొనసాగితే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. రామకృష్ణ వెంట సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు, అక్కినేని వనజ, దేగా ప్రభాకర్, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, కౌలు రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య తదితరులు ఉన్నారు.

అరెస్టు అన్యాయం: శ్రీనివాసరావు

రాజధాని ప్రాంత సమస్యలపై రైతులకు మద్దతుగా పాదయాత్ర చేయడానికి వెళుతున్న జడ శ్రావణ్ కుమార్‌ను అక్రమంగా అరెస్టు చేయడాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తీవ్రంగా ఖండిచారు. జీవో నంబరు 1ను హైకోర్టు కొట్టివేసిన తర్వాత కూడా ఇలాంటి చర్యలకు పాల్పడటం దుర్మార్గమన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని పోలీసులకు హితవు పలికారు. శ్రావణ్ కుమార్‌ను ఆయన ఫోన్ ద్వారా పరామర్శించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆంధ్ర మాల్యాద్రి, సూర్యారావు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పరామర్శించారు.

నున్న పోలీసు స్టేషన్‌లో పరామర్శించిన రామకృష్ణ

బాలకోటయ్య ఖండన

జడ శ్రావణ్‌కుమార్ అరెస్టును అమరావతి జేఏసీ నేత బాలకోటయ్య ఖండించారు. రాజధాని రైతులకు మద్దతుగా పాదయాత్ర చేయడం తప్పా అని ప్రశ్నించారు. ఆర్-5 జోన్ పేరుతో ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తున్నదని ఆరోపించారు. పోలీసులు చట్ట ప్రకారం పని చేయాలని కోరారు. వైసీపీ నాయకుల సభలు, ర్యాలీలకు అనుమతి అవసరం లేదా అని నిలదీశారు. అక్రమ అరెస్టుపై సీఎం స్పందించాలని, శ్రావణ్‌కుమార్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

శ్రావణ్‌కుమార్‌ను విడుదల చేయాలంటూ నున్న పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న రామకృష్ణ, వనజ, ఓబులేసు, కేవీవీ ప్రసాద్ తదితరులు

హిజాబ్ నిషేధంపై ఆందోళన చేసిన కనీజ్ ఫాతిమా విజయం

బెంగళూరు: కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో హిజాబ్ నిషేధాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేసిన మహిళ కనీజ్ ఫాతిమా గెలుపొందారు. బీజేపీ ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థినులతో కలిసి ఆందోళన చేసిన ఆమె బీజేపీ అభ్యర్థి చంద్రకాంత్ బీ పాటిల్ పై సుమారు 3 వేల ఓట్ల మెజారిటీతో గెలిచారు. కర్నాటకలో బీజేపీ ప్రభుత్వం హిజాబ్‌ను నిషేధించడం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది. విద్యా సంస్థల్లోకి ముస్లిం విద్యార్థినులు హిజాబ్ ధరించి వెళ్లరాదని కర్నాటక విద్యా శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలను వ్యతిరేకిస్తూ గత ఏడాది ఫిబ్రవరిలో కల్బుర్గి జిల్లా కలెక్టరేట్ ఎదుట కొందరు విద్యార్థినులతో కలిసి కాంగ్రెస్ లీడర్ కనీజ్ ఫాతిమా ఆందోళన చేశారు. ఇప్పుడు ఆ కనీజ్ ఫాతిమా కాంగ్రెస్ టికెట్‌పై బీజేపీ అభ్యర్థి చంద్రకాంత్ బీ పాటిల్‌ను ఓడించి గుల్బర్గ ఉత్తర నియోజకవర్గంలో గెలుపొందారు. హిజాబ్ బ్యాన్‌కు వ్యతిరేకం ఆందోళనలు చేసిన అతి కొద్ది మంది కాంగ్రెస్ నేతల్లో ఆమె ఒకరు. కనీజ్ ఫాతిమా 2018లోనే బీజేపీ అభ్యర్థి చంద్రకాంత్ బీ పాటిల్‌ను ఓడించారు. అప్పుడు 5,940 ఓట్ల తేడాతో ఆమె గెలిచారు. తాజాగా, అదే గుల్బర్గా ఉత్తర నియోజకవర్గం నుంచి అదే బీజేపీ అభ్యర్థిపై 2,712 వోట్ల తేడాతో విజయం సాధించారు. గుల్బర్గా ఉత్తర నియోజకవర్గం ముస్లిం ప్రాబల్యం అధికంగా ఉన్న నియోజకవర్గం. హిజాబ్‌ను నిషేధించడాన్ని ముస్లిం విద్యార్థినుల విద్యా హక్కును కాలరాస్తున్నారని ఆమె ఆందోళన సందర్భంలో మండిపడ్డారు. ఈ నిర్ణయం ద్వారా బీజేపీ మతపరమైన ఉద్రిక్తతలు రాజేయాలని ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. అదే సమయంలో ఆమె ప్రభుత్వానికి సవాల్ విసిరారు. దమ్ముంటే హిజాబ్ ధరించిన తనను అసెంబ్లీకి రాకుంటా ఆపగలరా అని సవాల్ విసిరారు. డిసెంబరు 2019లోనూ చిట్టాపూర్ ఎమ్మెల్యే ప్రియాంక్ ఖర్గేతో కలిసి ఆమె కల్బుర్గిలో పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలో పాల్గొన్నారు.

మోదీ లేకపోతేనే అది సాధ్యం

రుజువుచేసిన కర్నాటక ఫలితాలు: పవార్

ముంబై: 'మోదీ ఉంటేనే అది సాధ్యం' అన్న నినాదాన్ని ప్రజలు తిరస్కరించారని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అధ్యక్షుడు శరద్ పవార్ అన్నారు. కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయంపై ఆయన స్పందిస్తూ 'మోదీ హైతో ముమ్‌కిన్ హై' (మోదీ ఉంటేనే అది సాధ్యం) అన్న దాన్ని ప్రజలు తిరస్కరించారని తెలిపారు. అన్ని వ్యవస్థల్లో ఒక వ్యక్తి హవాను ప్రజలు ఇక ఏ మాత్రం అంగీకరించడం లేదన్నారు. 'మోదీ లేకపోతేనే అది సాధ్యం' అన్నది కర్నాటక ఎన్నికల ఫలితాలతో స్పష్టమైందని అన్నారు. అధికారంలో ఉన్న బీజేపీ కంటే డబుల్ మెజార్టీతో కాంగ్రెస్‌ను గెలిపించిన కర్నాటక ప్రజలను శరద్ పవార్ అభినందించారు. బీజేపీ అవినీతి, అధికార దుర్వినియోగానికి వ్యతిరేకంగా ఆ రాష్ట్ర ప్రజలు ఇచ్చిన తీర్పు అని చెప్పారు. కేరళ, తమిళనాడు, కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, జార్ఖండ్, పంజాబ్, పశ్చిమ బెంగాల్ వంటి చాలా రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో లేదని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల ఫలితాల చిత్రం, కర్ణాటక ఫలితాల ద్వారా మన కళ్లకు కనిపిస్తున్నదని అన్నారు. ఎన్నికైన ప్రభుత్వాలను కూలగొట్టేందుకు బీజేపీ అనుసరిస్తున్న కొత్త పద్ధతిపై శరద్ పవార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలను చీల్చి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గోవా, కర్నాటకలో ప్రభుత్వాలను పడగొట్టాంన్నారు. 'ఇటీవల కాలంలో ఎమ్మెల్యేలను చీల్చి, రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. అందుకు తన అధికార ఫార్ములాను ఆయన (మోదీ) వినియోగిస్తున్నారు. కర్నాటకలో కూడా అదే పని చేశారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని నాశనం చేశారు' అని విమర్శించారు. కర్ణాటక ఎన్నికల్లో ఎన్సీపీ కూడా పోటీ చేసిందని, అయితే అది ఒక ప్రయత్నం మాత్రమేనని శరద్ పవార్ తెలిపారు. బీజేపీని ఓడించేందుకు కొత్త రాష్ట్రంలో అడుగుపెట్టాలని ఎన్సీపీ నిర్ణయించిందని చెప్పారు. మహారాష్ట్రలో ఎన్సీపీ ఒంటరిగా పోటీ చేయదన్నారు. ఉద్ధవ్ సేన, కాంగ్రెస్‌తోపాటు ఇతర చిన్న పార్టీలను కలుపుకుని ముందుకు వెళ్తామన్నారు. అయితే తాను ఒంటరిగా ఈ నిర్ణయం తీసుకోబోనన్న శరద్ పవార్, మిగతా వారితో కలిసి దీనిపై చర్చిస్తానని పవార్ తెలిపారు.

బెవరేజెస్ హమాలీల సమస్యలు పరిష్కరించాలి

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ బెవరేజెస్ కార్పొరేషన్‌లో ఐయంయఫ్ఎల్ డిపోల్లో లోడింగు, అన్ లోడింగు పనులు నిర్వహించే హమాలీ కార్మికులకు దిగుమతి కూలీ రేట్లు తక్షణం పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు కె.రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. గత ఒప్పందం పూర్తయి ఇప్పటికే రెండు నెలలయిందని, కానీ ప్రభుత్వం ఏమాత్రం స్పందించపోవడం విచారకరమన్నారు. శనివారం విజయవాడ గొల్లపూడి ఐయంయఫ్ ఎల్ డిపోలో కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేషన్‌తో గతంలో చేసుకున్న ఒప్పందం ఈ ఏడాది మార్చి 31 నాటికి ముగిసిందని, ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్త కూలీ ఇవ్వాల్సి ఉందన్నారు. కానీ ఇంతవరకు లిక్కర్ కంపెనీల యజమాన్యాలు కానీ, ఇటు ప్రభుత్వం కానీ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటి ప్రధాన కార్యదర్శి యస్.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఇప్పటికే బెవరేజెస్ కార్పొరేషన్ ఎండీకి మార్చి 27న కొత్త కూలీ రేట్లపై వినతిపత్రం అందజేశామని, తర్వాత ఏప్రిల్ 24న, ఈనెల 11న మరోమారు కలిశామన్నారు. ఆ సందర్భంగా ఈనెల 15 లోపు చర్చలు నిర్వహించి న్యాయం చేయకపోతే 16వ తేదీ నుంచి కార్మికులు పనిలో మార్పు చేసి ఎవరైతే ఒక బాక్సుకు 8 రూపాయలు ఇస్తారో వారి సరుకే దించుతామని కూడా తెలియజేశామన్నారు. లేనిపక్షంలో సమ్మె తప్పదని కూడా హెచ్చరించామన్నారు. అయినప్పటికీ కార్పొరేషన్ అధికారుల్లో స్పందన లేకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా తక్షణమే స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఉద్యమ కార్యాచరణ ప్రకటించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గొల్లపూడి డిపో పెద్ద మేస్త్రీ సురేంద్ర. సదయ్య, ప్రసాద్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడల కోసం శిక్షణ శిబిరాలు

ఏపీఓఏ అధ్యక్షుడు ఆర్కే పురుషోత్తం

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: గోవాలో ఈ ఏడాది అక్టోబరు 24 నుంచి నవంబరు 24 వరకు జరిగే జాతీయ క్రీడలకు ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘం (ఏపీఓఏ) అధ్యక్షుడు ఆర్కే పురుషోత్తం తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఇందుకోసం సంబంధిత గేమ్స్, స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీలు, శాప్ అధికారులతో ఏపీఓఏ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం విజయవాడలోని ఓ హోటల్‌లో ఏపీఓఏ ప్రత్యేక జనరల్ బాడీ సమావేశం జరిగింది. జాతీయ క్రీడలకు ఎంపికైన వారికి శిక్షణ శిబిరాలు, జూన్ 23న అన్ని జిల్లా కేంద్రాల్లో ఒలింపిక్ రన్ నిర్వహించడంపై విస్తృతంగా చర్చించారు. అనంతరం ఆర్కే పురుషోత్తం వివరాలను మీడియాకు వెల్లడించారు. గోవా జాతీయ క్రీడలకు రాష్ట్ర జట్లను తీసుకెళ్లేందుకు ఏపీఓఏ కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. జూన్ 23న అన్ని జిల్లా కేంద్రాల్లో ఒలింపిక్ రన్ నిర్వహిస్తామని, శాప్ ఆర్థిక సహకారం అందించడానికి సిద్ధంగా ఉంటే, ఏపీఓఏ రాష్ట్ర స్థాయి ఒలింపిక్ రన్‌ను విజయవాడలో నిర్వహిస్తుందని ఆయన చెప్పారు. గతంలో 2015, 2019లో విజయవాడలో ఈ తరహా రన్ నిర్వహించామని గుర్తు చేశారు. ఈలోగా కొత్తగా ఏర్పాటైన కాకినాడ, ఎన్టీఆర్, చిత్తూరు, ఏలూరు జిల్లాల ఒలింపిక్ అసోసియేషన్లకు ఏపీఓఏ ఎన్నికలు నిర్వహించనుందని తెలిపారు. ఐఓఏ బైలాస్ ప్రకారం... చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) పోస్టును త్వరలో భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఒకే ఒక ఏపీఓఏ ఉందని, రెండో సంఘం లేదని అన్నారు. ఏపీఓఏ కార్యదర్శిగా ఎవరైనా తమ పేరు వాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏపీఓఏ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నాదెళ్ల బ్రహ్మజీరావు, కోశాధికారి రామం శ్రీనివాస్, కబడ్డీ జాతీయ కోచ్ పద్మజా బాల పాల్గొన్నారు.

శ్రీవల్లి పాత్ర నాకు బాగా సరిపోతుంది

హైదరాబాద్: ఐశ్వర్యా రాజేష్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న తాజా చిత్రం ఫర్హానా. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్.ఆర్.ప్రకాష్, ఎస్.ఆర్.ప్రభు ఈ చిత్రాన్ని నిర్మించారు. డైరెక్టర్ నెల్సన్ వెంకటేశన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా మే12న తెలుగుతోపాటు.. తమిళం, హిందీ, తెలుగు భాషల్లో విడుదలైంది. అయితే ఈ సినిమా ప్రమోషనల్లో భాగంగా ఐశ్వర్య రాజేష్ చేసిన వ్యాఖ్యలు...ఇప్పుడు సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. పుష్ప చిత్రంలో రష్మిక పోషించిన శ్రీవల్లి పాత్ర తనకు వచ్చి ఉంటే... నటించేదాన్ని అని, ఆ రోల్ తనకు బాగా సరిపోతుందని అన్నారు. అలాగే తనకు తెలుగు ఇండస్ట్రీ అంటే చాలా ఇష్టమని.. ఎన్నో సంవత్సరాలు ఎదురుచూసిన తర్వాత వరల్డ్ ఫేమస్ లవర్ చిత్రంలో అవకాశం వచ్చిందని చెప్పుకొచ్చింది. "వరల్డ్ ఫేమస్ లవర్ సినిమా నన్ను తెలుగువారికి దగ్గర చేసింది. ఆ తర్వాత టక్ జగదీశ్, రిపబ్లిక్ సినిమాలు చేశాను. తెలుగులో నాకు ఆఫర్స్ రావట్లేదని కాదు... కాకపోతే మంచి పాత్రలతో మళ్లీ కమ్ బ్యాక్ ఇవ్వాలని ఉంది. ప్రస్తుతానికి తెలుగులో ఏ ప్రాజెక్ట్ చేయడం లేదు. ఒకవేళ నాకు పుష్పలో అవకాశం వచ్చి ఉంటే.. తప్పకుండా చేసేదాన్ని... రష్మిక బాగా నటించారు... కాకపోతే ఆ రోల్ నాకు బాగా సెట్ అవుతుందని నా నమ్మకం... అలాగే నాకు డ్రీమ్ రోల్ అంటూ ఏదీ లేదు. ప్రేక్షకులను అలరించే విధంగా మంచి పాత్రలు చేయాలని ఉంది. పాత్ర ఏదైనా సరే దుమ్ము దులిపేయడమే" అంటూ చెప్పుకొచ్చింది ఐశ్వర్య రాజేష్. సినిమా చిన్నదైనా లేదా పెద్దదైనా తెలుగు ప్రేక్షకులు దాన్ని ఆదరించే తీరు ప్రత్యేకంగా ఉంటుందని ఆమె అంది. సినిమా బాగుందని చెబితే చాలు... వాళ్లే దాన్ని బ్లాక్ బస్టర్ చేస్తారని తెలిపింది.

సన్‌రైజర్స్ ప్లేఆఫ్ ఆశలు గల్లంతు

కీలక మ్యాచ్‌లో లక్నో ఘన విజయం

హైదరాబాద్: ప్లే ఆఫ్స్ చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తేలిపోయింది. బ్యాటింగ్‌లో ఫర్వాలేదనిపించినా... పసలేని బౌలింగ్‌తో లక్నోకు విజయం కట్టబెట్టింది. హైదరాబాద్ నిర్దేశించిన 183 పరుగుల లక్ష్యా న్ని 19.2 ఓవర్లలో లక్నో ఛేదించింది. స్టొయినిస్(40), మన్కడ్(64), పూరన్ (44)లు బీభత్సం సృష్టిం చారు. మేయర్స్(2)ను ఫిలిప్ ఔట్ చేశాడు. తర్వాత దూకుడు పెంచిన డికాక్ (29)ను మయంక్ మార్కండే బోల్తా కొట్టించాడు. ఆ తర్వాత స్టోయినిస్- మన్కడ్ మూడో వికెట్‌కు 74 పరుగుల భాగస్వామ్యాన్ని జోడించారు. 16 ఓవర్లో అభిషేక్ బౌలింగ్‌లో రెండు సిక్సర్లతో ఊపందుకున్న స్టోయినిస్ ఔట్ కాగా అప్పుడే వచ్చిన పూరన్ బాదిన మూడు భారీ సిక్సర్లతో ఆ ఓవర్లో 31 పరుగులు వచ్చాయి. అప్పటి వరకూ సన్‌రైజర్స్ గెలుపు మీద ఉన్న ఆశలపై పూరన్ నీళ్లు చల్లాడు. అంతే.. సమీకరణం 24 బంతుల్లో 38గా మారింది. తర్వా త క్రమం తప్పకుండా పూరన్ బౌండరీలు బాది లక్నోకు విజయాన్ని చేరువ చేశాడు. ఇక హైదరాబాద్ బౌలర్లలో ఫిలిప్స్, మార్కండే, అభిషేక్ తలో వికెట్ తీశారు. ఈ గెలుపుతో లక్నో పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. అంతకుముందు, టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ 6 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. అభిషేక్ నిరాశపర్చినా.. మరో ఓపెనర్ అన్మోల్‌ప్రీత్ 36 పరుగులతో ఫర్వాలేదనిపించాడు. తర్వాత వచ్చిన త్రిపాఠి (20), కెప్టెన్ మర్‌క్రమ్ (28), వేగంగా ఆడే ప్రయత్నం లో వికెట్లు పారేసుకున్నారు. మిడిల్ ఆర్డర్‌లో వచ్చిన క్లాసిన్ (29 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లు)47 పరుగులు చేశాడు. ఆఖర్లో, గత మ్యాచ్ హీరో అబ్దుల్ సమద్ ఏకంగా 4 సిక్సర్లతో 37 పరుగులు చేశాడు. లక్నో బౌలర్లలో కెప్టెన్ కృనాల్ రెండు, యుధ్వీర్, ఆవేశ్, యశ్ ఠాకూర్, అమిత్ మిశ్ర తలో వికెట్ తీశారు.

శరవేగంగా కొరటాల-ఎన్టీఆర్ సినిమా

హైదరాబాద్: కొరటాల శివ జూనియర్ ఎన్టీఆర్ హీరోగా ఓ పాన్ ఇండియా యాక్షన్ డ్రామాను తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే సెట్స్ మీద ఉన్న ఈ సినిమా విషయంలో గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా జాగ్రత్త పడుతున్నారు కొరటాల శివ. ఎన్టీఆర్-30 విషయంలో మొదటిరోజు నుంచే ఈ సినిమాను వార్తల్లో ఉంచేందుకు కృషి చేస్తున్నారు. ఇటీవల ప్రారంభమైన ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. పాన్ ఇండియా సినిమా కావటంతో హీరోయిన్‌గా జాన్వీ కపూర్‌ను ముందుగానే ప్రకటించేశారు. ఆ తరువాత కొంత వ్యవధి తీసుకొని విలన్‌గా సైఫ్ అలీఖాన్ నటిస్తున్న విషయాన్ని వెల్లడించారు. అయితే ఈ సమయం కూడా వ్యూహాత్మకంగా చేసిందే అంటున్నారు ఇండస్ట్రీ జనాలు. ఒకేసారి అన్ని విషయాలు తెలియజేయకుండా ఒక్కొక్క అప్‌డేట్‌తో సినిమాను వార్తల్లో ఉంచే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్లాన్ బాగానే వర్క్ అవుట్ అయ్యింది. అలాగే ఫస్ట్ లుక్ రిలీజ్ విషయంలోనూ ఓ అడుగు ముందే ఉన్నారు కొరటాల. ప్రీ లుక్‌తోనే సినిమా మీద హైప్ పెంచిన మేకర్స్... త్వరలో ఫస్ట్‌లుక్ రిలీజ్‌కు సిద్ధమవుతున్నారు.

పూరీతో సినిమాలు చేయొద్దు

అగ్ర హీరోలకు ఎగ్జిబిటర్ల సంఘం విజ్ఞప్తి

విశాలాంధ్ర-హైదరాబాద్: దర్శకుడు పూరీ జగన్నాథ్‌కు అగ్ర హీరోలెవరూ కాల్షీట్లు ఇవ్వద్దంటూ తెలంగాణ ఎగ్జిబిటర్ల సంఘం విజ్ఞప్తి చేసింది. పూరీ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ నటించిన లైగర్ చిత్రం బాక్సాఫీసు వద్ద ఘోర పరాజయం పాలవడంతో ఆ చిత్రాన్ని విడుదల చేసిన తమకు సుమారు రూ.9 కోట్ల నష్టం వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో దర్శకుడు పూరీ జగన్నాథ్ ఎగ్జిబిటర్లను ఆదుకుంటానని వారికి జరిగిన నష్టాన్ని ఆరు నెలల్లో తీరుస్తానని హామీ ఇచ్చి మర్చిపోయారని సంఘం పేర్కొంది. హైదరాబాద్ ఫిల్మ్ చాంబర్ వద్ద లైగర్ బాధితుల సంఘం పేరుతో ఎగ్జిబిటర్లు నిరవధిక నిరాహార దీక్షకు దిగారు. లైగర్ చిత్ర విషయంలో బాధిత ఎగ్జిబిటర్లను పూరీ జగన్నాథ్ ఆదుకొని మాట నిలబెట్టుకోవాలని కోరారు. అంతవరకు చిరంజీవి, నాగార్జున, బాలకృష్ణ సహా ఇతర అగ్ర హీరోలెవరూ పూరీ జగన్నాథ్‌కు కాల్షీట్లు ఇవ్వొద్దని విజ్ఞప్తి చేశారు. కాగా ఎగ్జిబిటర్ల ఆందోళనను తెలుగు ఫిల్మ్ చాంబర్... నిర్మాత ఛార్మి దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై స్పందించిన ఛార్మి... విషయమంతా తనకు తెలుసని, ఎగ్జిబిటర్లందరికి మేలు జరిగేలా కృషి చేస్తున్నామని మెయిల్ ద్వారా సమాచారం పంపారు.

అలాంటి షాట్ ఎన్నడూ చూడలేదు

ముంబై: వాంఖడే మైదానంలో 'సూర్య' చేసిన బ్యాటింగ్ విధ్వంసంపైనే ఇప్పుడు అంతటా చర్చ జరుగుతోంది. అతడు ఆడిన షాట్లను వర్ణించడానికి క్రికెట్ పండితులకూ మాటలు రావడం లేదు. అంతలా పరుగుల సునామీ సృష్టించాడు. గుజరాత్ టైటాన్స్‌పై శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ 49 బంతుల్లో 103 పరుగులు చేశాడు. సూర్య తన ఇన్నింగ్స్‌లో మొత్తం 6 సిక్సులు కొట్టగా... అందులో థర్డ్ మ్యాన్ దిశగా కొట్టిన ఓ షాట్ అద్భుతం. క్రికెట్ దిగ్గజాలు కూడా ఈ షాట్ ఎలా సాధ్యమంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ మాజీ కోచ్, ఆస్ట్రేలియా దిగ్గజ స్పిన్నర్

సూర్య సిక్సర్‌పై టామ్ మూడీ స్పందన

టామ్ మూడీ కూడా దీనిపై స్పందించాడు. సూర్య బ్యాట్‌ను కత్తిలా వాడి బంతిని కోస్తున్నట్లుగా కొట్టిన ఓ షాట్‌కు థర్డ్ మ్యాన్‌లో బంతి బౌండరీ దాటింది. తన జీవితంలో ఎన్నో షాట్లను చూశాను గానీ.. ఇలాంటి షాట్‌ను చూడలేదని మూడీ వర్ణించాడు. 'థర్డ్ మ్యాన్ దిశగా వర్టికల్‌గా సిక్స్ కొట్టడం నేనెప్పుడూ చూడలేదు. హారిజాంటల్‌గా కొట్టడం చూశాను. అన్ని ఫార్మాట్లలో నా జీవిత కాలంలో దాదాపు 10 మిలియన్ బంతులను చూసుంటాను. కానీ.. ఇలాంటి షాట్ చూడలేదు. అలాంటి షాట్‌ను ఇంకెవ్వరూ కొట్టలేరు. అతడికి మాత్రమే సాధ్యం' అంటూ మూడీ ఓ ఛానల్‌తో మాట్లాడుతూ విశ్లేషించాడు. ఇక ఈ షాట్‌ను చూసి ముంబయి మెంటార్ సచిన్ టెండూల్కర్ కూడా ఆశ్చర్యపోయిన విషయం తెలిసిందే.

జూలు విదిల్చిన ముంబై ఇండియన్స్

ఐపీఎల్ 16వ సీజన్‌లో తొలుత తబబాటుకు గురైన ముంబై ఇండియన్స్ కీలక సమయంలో జూలు విదిల్చింది. ముంబై ఇండియన్స్ వరుస విజయాలతో ప్లే ఆఫ్స్ బెర్తుకు మరింత చేరువైంది. గుజరాత్‌పై విజయంతో ముంబై ఏడో విజయం నమోదు చేసుకుంది. గత ఐదు మ్యాచ్‌ల్లో రోహిత్‌సేనకు ఇది నాలుగో విజయం కావడం గమనార్హం.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.